ఈనాడు
అమరావతి
ఎన్టీఆర్
శుక్రవారం అక్టోబరు 11, 2024

12న ఉచిత దర్శనం

ఇంద్రకీలాద్రి: ఈ నెల 12న దసరా సందర్భంగా భవానీ దీక్షాధారులు తరలి వచ్చే అవకాశం ఉన్నందున ఐదు క్యూలైన్లలో ఉచితంగా భక్తులకు దర్శనం కల్పించాలని నిర్ణయించినట్లు రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి రామనారాయణరెడ్డి ప్రకటించారు.


ఇంద్రకీలాద్రిపై దసరా శరన్నవ రాత్రి ఉత్సవాలు ఘనంగా సాగుతున్నాయి. ఉత్సవాల ఏడో రోజు గురువారం అమ్మవారు శ్రీదుర్గాదేవి రూపంలో భక్తులకు దర్శనమిచ్చింది. వేకువన 4 గంటల నుంచి రాత్రి 11 వరకు లక్ష మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. బుధవారం మూలా నక్షత్రం సందర్భంగా క్యూలైన్లు కిక్కిరిసి రాత్రి వరకూ కొనసాగాయి. వచ్చిన భక్తులందరికీ సరస్వతీదేవి దర్శనం కల్పించేందుకు త్వరితగతిన క్యూలైన్లను ముందుకెళ్లేలా అధికారులు చర్యలు తీసుకున్నారు. మూలానక్షత్రంతో పోలిస్తే గురువారం రద్దీ కొద్దిగా తగ్గింది.

దుర్గతి నాశిని సద్గతి దాయని

నేడు మహిషాసుర మర్దినిదేవిగా దర్శనం...

ఇంద్రకీలాద్రిపై దసరా ఉత్సవాలలో ఎనిమిదో రోజు శుక్రవారం అమ్మవారు మహిషాసురమర్దినిదేవి రూపంలో భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు.

దర్శన సమయాలు: వేకువన 4 నుంచి రాత్రి 11 గంటల వరకు



నేటి అలంకారం
శ్రీ మహిషాసుర మర్దని దేవి
నేడు అమ్మవారికి అలంకరించే పట్టు చీర
లేత నీలం

శ్రీ దుర్గాదేవిగా జగన్మాత

దర్శనానికి తరలివచ్చిన భక్తులు



కృష్ణమ్మ మదిలో సేవా“రతన్”



పారిశ్రామిక మేరునగ ధీరుడు.. రతన్ టాటా. ప్రపంచంలోనే అత్యంత ప్రభావశీలురైన పారిశ్రామిక వేత్త. నిరాడంబరంగా ఎదిగిన టాటా.. అపూర్వ సేవాప్రస్థానంతో కోట్లాది హృదయాల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్నారు. ముఖ్యంగా ఉమ్మడి కృష్ణా జిల్లాలో 264 గ్రామాల్లో టాటా ట్రస్టు ద్వారా సేవలు అందించి ఔదార్యం చాటారు. ఆరోగ్యమే మహాభాగ్యం అని ఆచరణలో చాటుతూ.. పేదింట ప్రాణదీపాలు వెలిగించారు. నారీమణులను నైపుణ్యబాటలో నడిపి ఆర్థిక స్థిరత్వంతో ఎదిగేలా అండగా నిలిచారు. అక్షర వెలుగులు పంచేలా విద్యాలయాలను తీర్చిదిద్దారు. పల్లెసీమలకు సుజలాలు దరి చేర్చి.. బృహత్తర బాధ్యతను నిర్వర్తించారు. సేద్యానికి వెన్నుగా.. స్వచ్ఛతకు దన్నుగా నిలిచారు. అఖండ భారతావనికి కన్నీటిని మిగిల్చి... దిగ్గజం దివికేగిన వేళ.. కృష్ణమ్మ మదిలో కొలువుదీరిన సేవా“రతన్” సంకల్ప పథంపై “ఈనాడు” ప్రత్యేక కథనం... 6లో..



కేంద్ర సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాస వర్మకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఈవో రామారావు



మాట్లాడుతున్న ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ



పశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరి దంపతులకు అమ్మవారి చిత్రపటం అందిస్తున్న ఈవో రామారావు

జగన్మాత ఆశీస్సులతో సమగ్రాభివృద్ధి

ఇంద్రకీలాద్రి, చిట్టినగర్, న్యూస్‌టుడే : జగన్మాత ఆశీస్సులతో ఎన్డీఏ కూటమి ప్రభుత్వ పాలనలో దేశం, రాష్ట్రం సమగ్రాభివృద్ధి చెందుతుందని కేంద్ర సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాస వర్మ అన్నారు. ఇంద్రకీలాద్రిపై కొలువైన జగన్మాత దుర్గమ్మను భూపతి రాజు శ్రీనివాస వర్మ కుటుంబ సభ్యులతో కలిసి గురువారం దర్శించుకున్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. సామాన్య భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశారన్నారు. కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపేందుకు అన్ని రకాల ప్రయత్నాలను సమన్వయంతో చేస్తుందన్నారు.

☛ దసరా శరన్నవ వేడుకల్లో భాగంగా నిజ రూపమైన దుర్గమ్మ అలంకారంలో ఉన్న అమ్మ వారిని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ కృష్ణ తేజ, ప్రముఖ చిత్ర నిర్మాత ఏ.ఎం. రత్నం వేర్వేరుగా గురువారం దర్శించుకున్నారు.

రాష్ట్రాన్ని చంద్రబాబు గాడిలో పెడుతున్నారు : రాష్ట్రాన్ని గత ప్రభుత్వం సర్వనాశనం చేసిందని చంద్రబాబు అభివృద్ధి దిశగా గాడిలో పెడుతున్నారని, అందుకు అమ్మ ఆశీస్సులు ఉండాలని వేడుకున్నట్లు ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ అన్నారు. గురువారం దుర్గాదేవి అలంకారంలో ఉన్న అమ్మవారిని ఆయన దర్శించుకున్నారు. గతంతో పోలిస్తే భక్తులకు దర్శనం అందించే విధానం, అద్భుత నాణ్యత చాలా బాగుందన్నారు. భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు వివరించారు.

☛ దుర్గాదేవి అలంకారంలో ఉన్న అమ్మవారిని పశ్చిమ ఎమ్మెల్యే సుజనాచౌదరి సతీసమేతంగా గురువారం దర్శించుకున్నారు. అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సామాన్య భక్తులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా దర్శనం చేసుకునే విధంగా ఏర్పాట్లు చేశామన్నారు. అమ్మవారి అనుగ్రహం వల్లే పశ్చిమ ఎమ్మెల్యేగా విజయం సాధించానన్నారు.

విజయవాడలో రైల్వే లోకో పైలెట్ దారుణ హత్య

సైకోగా భావిస్తున్న పోలీసులు ✦ రైల్వే పరిసరాల్లో వరుస దాడులు

విజయవాడ (రైల్వేస్టేషన్), న్యూస్‌టుడే : విజయవాడలో విధి నిర్వహణలో ఉన్న రైల్వే లోకో పైలెట్ దారుణ హత్యకు గురవ్వడం తీవ్ర కలకలం రేపుతోంది. నిత్యం జనసంచారం ఎక్కువగా ఉండే విజయవాడ రైల్వేస్టేషన్ సమీపంలోనే ఈ హత్య జరగడం ఉద్యోగుల్లో ఆందోళన కలిగిస్తోంది. నగరానికి చెందిన డి.ఏబేలు(52) రైల్వే షంటింగ్ లోకో పైలెట్‌గా పని చేస్తుంటారు. విజయవాడ రైల్వేస్టేషన్ నుంచి ఎఫ్ క్యాబిన్ మధ్య బుధవారం అర్ధరాత్రి 2 గంటల సమయంలో విధి నిర్వహణలో ఉండగా గుర్తు తెలియని ఆగంతకుడు అకస్మాత్తుగా లోకో పైలెట్‌పై ఇనుప రాడ్డుతో తలపై బలంగా కొట్టడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే రైలు పట్టాలపై పడిపోయారు. మరో షంటింగ్ లోకో పైలెట్ పృథ్వీరాజ్ చూసి బాధితుడిని వెంటనే రైల్వే సిబ్బంది సహాయంతో సమీపంలోని రైల్వే ఆసుపత్రికి తరలించారు. అప్పటికే పరిస్థితి విషమించడంతో వైద్యులు మెరుగైన చికిత్స నిమిత్తం నగరంలోని ఓ కార్పొరేట్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో మృతి చెందారు. డబ్బు లేదా ఏదైనా విలువైన వస్తువుల కోసం హత్య చేశారా.. ఇంకేమైనా కారణాలున్నాయా అనే విషయం తెలియడం లేదు. బ్లేడ్ బ్యాచ్ లేదా గంజాయి బ్యాచ్ అనే విషయం తెలియడం లేదు. ఆగంతకుడు నడుస్తూనే ఒక్కసారిగా జనాలపై ఇనుపరాడ్డుతో తలపై మోదుతున్నాడని భావిస్తున్నారు.



ఏబేలు(పాతచిత్రం)



పోలీసులు అనుమానిస్తున్న వ్యక్తి

సైకోగా పోలీసుల అనుమానం..

గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు నాలుగు వేర్వేరు రైల్వే ప్రదేశాల్లోనే పలు ఘటనలు చోటు చేసుకున్నాయి. నైజాం గేట్ సెంటరులో ఓ రైల్వే కార్మికుడిపై కూడా దాడి జరిగినట్లు తేలింది. న్యూరాజరాజేశ్వరిపేటలోనూ ఇదే తరహాలో వ్యక్తిపై దాడి జరిగింది. రాత్రి 8 గంటల సమయంలో కృష్ణలంక సమీపంలోని రైల్వే బ్రిడ్జిపై ఆగంతకుడు దాడికి పాల్పడుతుండగా పరిసర ప్రాంతాలకు చెందిన వ్యక్తులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు వచ్చేలోపే విజయవాడ రైల్వేస్టేషన్ వైపు పారిపోయినట్లు స్థానికులు చెప్పారు. పోలీసులు సైకోగా భావిస్తూ రైల్వే పరిసరాల్లో భద్రతను కట్టుదిట్టం చేశారు. పరిసరాల్లోని సీసీ కెమెరాలను క్షుణ్నంగా పరిశీలిస్తున్నారు. హత్య చేసిన వ్యక్తి.. మరో మూడు ప్రాంతాల్లో దాడికి పాల్పడినది ఒకరేనా అనేది రైల్వే పోలీసులకు అంతుపట్టడం లేదు. రైల్వే పోలీసు ఉన్నతాధికారులు రంగంలోకి దిగారు.

రెండు ప్రత్యేక టీమ్‌ల ఏర్పాటు..

నిందితుడిని పట్టుకునేందుకు రెండు ప్రత్యేక టీమ్‌లను రంగంలోకి దించి రైల్వే పరిసరాలను జల్లెడ పడుతున్నారు. రైల్వే డీఎస్పీ రత్నరాజు పర్యవేక్షణలో జీఆర్పీ సీఐ జె.వి. రమణ, సిబ్బంది నిందితుడి కోసం విస్తృతంగా గాలిస్తున్నారు. సీసీ కెమెరాల దృశ్యాలను బట్టి నిందితుడికి మానసికస్థితి సరిగా లేదని భావిస్తున్నామని సీఐ చెప్పారు. అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. లోకోపైలెట్‌పై దాడి ఘటనపై రైల్వే కార్మికులు, కార్మిక సంఘాలు ఆందోళన చెందుతున్నాయి. విధి నిర్వహణలో ఉన్న రైల్వే సిబ్బందికి తక్షణమే భద్రత కల్పించాలని ఆలిండియా రైల్వే ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం జోనల్ ప్రధాన కార్యదర్శి గూటాల పాపారావు డీఆర్ఎంకు విజ్ఞప్తి చేశారు.

నేటి నుంచి శక్తి విజయోత్సవం

ఘనంగా ఏర్పాట్లు



ఆకట్టుకునేలా ఏర్పాటు చేసిన ప్రవేశద్వారం



సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు ఏర్పాటు చేసిన వేదికలు

భవానీపురం, న్యూస్‌టుడే : కృష్ణానది ఒడ్డున పున్నమి ఘాట్ వేదికగా ఏపీ పర్యాటక శాఖ ఆధ్వర్యంలో శక్తి విజయోత్సవం పేరుతో నిర్వహిస్తున్న కార్యక్రమం శుక్రవారం ప్రారంభం కానుంది. ఈ వేడుక మూడు రోజుల పాటు నిర్వహించనున్నారు. ఘాట్ వద్ద ఐదు వేదికలు ఏర్పాటు చేశారు. ఒక వేదికపై అతిథులు ఉండనున్నారు. మిగిలిన నాలుగు వేదికల వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయి. 11వ తేదీన మహిళా ఉత్సవం నిర్వహిస్తారు. వివిధ రంగాల్లో రాణిస్తున్న మహిళలకు పురస్కారాలు అందించనున్నారు. 12, 13 తేదీల్లో సాంస్కృతిక కార్యక్రమాలు, హస్తకళ ప్రదర్శన ఉంటాయి. ఏపీ, తెలంగాణకు చెందిన వంటకాలతో కూడిన ఫుడ్ ఫెస్టివల్‌ను నిర్వహించనున్నారు. డ్రోన్‌షో, బాణసంచా కాల్చడం, తదితర కార్యక్రమాలు ఉంటాయి. కార్యక్రమం విజయవంతం చేసేందుకు కళాకారులు రిహార్సల్స్‌ను గురువారం సాయంత్రం పున్నమిఘాట్ వద్ద నిర్వహించారు.

క్రీడాకారుల ప్రోత్సాహానికి చిత్తశుద్ధితో కృషి

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సహకారంతో రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ (శాప్) కార్పస్ ఫండ్‌గా రూ.10 కోట్లు కేటాయించినట్లు రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రామ్‌ప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో శాప్ చైర్మన్ రవినాయుడు, శాప్ ఎండీ పీఎస్ గిరీషాతో కలిసి ఆయన గురువారం క్రీడా సంఘాలతో క్రీడా విధానం, క్రీడా యాప్‌పై సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ రానున్న అయిదేళ్లలో క్రీడారంగంలో పలు మార్పులు తీసుకొస్తామన్నారు. 175 నియోజకవర్గాల్లో గ్రామస్థాయి నుంచి క్రీడాకారులను ప్రోత్సహించడానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తుందన్నారు. క్రీడా సంఘాలకు నిధుల సమకూర్పేలా చర్యలు చేపడతామన్నారు. [illegible] అవసరమని మంత్రి సూచించారు. శాప్ చైర్మన్ రవినాయుడు మాట్లాడుతూ క్రీడాకారులకు మౌలిక సౌకర్యాలు, ప్రోత్సాహకాలపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. సీఎస్ఆర్, పీపీపీ విధానానికి ప్రాధాన్యమిస్తామన్నారు. శాప్ ఎండీ పీఎస్ గిరీషా మాట్లాడుతూ క్రీడా విధానానికి సంబంధించి సమావేశంలో వచ్చిన సూచనలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళతామన్నారు. క్రీడాకారులకు అందుబాటులో ఉండేలా క్రీడలకు సంబంధించిన యాప్ తీసుకురానున్నామన్నారు. ఈ యాప్ ద్వారా క్రీడా సంఘాలు తమ కార్యకలాపాలను నమోదు చేయడం, పోటీల్లో గెలుపొందిన తర్వాత వాటికి సంబంధించిన సర్టిఫికెట్లను కూడా ఈ యాప్ నుంచి పొందవచ్చన్నారు. అది కూడా ఓటీపీ ద్వారా సంఘం కార్యదర్శి సంతకంతో వస్తుందన్నారు. తర్వాత వాటిని ఆన్‌లైన్‌లోనే తీసుకోవచ్చన్నారు. సమావేశంలో సుమారు 36 క్రీడా సంఘాల ప్రతినిధులు, క్రీడాధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మంత్రి మండిపల్లి రామ్‌ప్రసాద్‌రెడ్డి, శాప్ చైర్మన్ రవినాయుడు, శాప్ ఎండీ పీఎస్ గిరీషా

రతన్ టాటా మరణం జాతికి తీరని లోటు: ఎంపీ

పటమట: దేశ పారిశ్రామిక, వాణిజ్య రంగ పురోగతిలో కీలకపాత్ర పోషించిన మానవతావాది రతన్ టాటా మృతి బాధాకరమని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) ఒక ప్రకటనలో పేర్కొన్నారు. టాటా మృతి పట్ల ఆయన సంతాపం వ్యక్తం చేశారు. 2015లో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో విజయవాడ పార్లమెంటు పరిధిలో 264 గ్రామాలను అభివృద్ధి చేయడానికి టాటా ట్రస్టు ముందుకొచ్చిందని తెలిపారు. దేశ ప్రజల హృదయాల్లో రతన్ టాటా ఎప్పటికీ జీవించే ఉంటారని, సమాజానికి ట్రస్టు ద్వారా ఎన్నో సేవలందించారని పేర్కొన్నారు.

దిగ్గజానికి నివాళి

విజయవాడ(భవానీపురం), న్యూస్‌టుడే : భారత పారిశ్రామిక దిగ్గజం, టాటాసన్స్ గౌరవ ఛైర్మన్ రతన్‌టాటా పార్థివదేహానికి విజయవాడ మాజీ ఎంపీ కేశినేని నాని, ఆయన కుమార్తె కేశినేని శ్వేత గురువారం నివాళి అర్పించారు. ముంబాయిలోని ఎన్‌సీపీఏ మైదానంలో ఉంచిన రతన్‌టాటా పార్థివదేహం వద్ద పూలమాల ఉంచి అంజలి ఘటించారు. రతన్ టాటా కుటుంబ సభ్యులకు, టాటా గ్రూపు సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా కేశినేని నాని మాట్లాడుతూ టాటా ట్రస్ట్ ద్వారా విజయవాడ పార్లమెంటు పరిధిలో అనేక సేవా కార్యక్రమాలు చేపట్టినట్లు పేర్కొన్నారు. పేద ప్రజలను ఆదుకునేందుకు వీలుగా కార్యక్రమాలు చేశామన్నారు. విద్య, ఆరోగ్యం, వైద్యం, పారిశుద్ధ్య తదితర కార్యక్రమాలు చేపట్టినట్లు ఆయన గుర్తు చేశారు.



రతన్‌టాటా పార్థివదేహం వద్ద నివాళి అర్పిస్తున్న విజయవాడ మాజీ ఎంపీ కేశినేని నాని, శ్వేత

అదనపు ఎస్పీలకు పదోన్నతులు.. పోస్టింగ్‌లు

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే : రాష్ట్ర వ్యాప్తంగా అదనపు ఎస్పీ స్థాయి అధికారుల బదిలీ ప్రక్రియ చేపట్టారు. వీరిలో కొంత మందికి ఎస్పీలుగా పదోన్నతులు కల్పించి, బదిలీ చేశారు. ఇందులో భాగంగా కృష్ణాజిల్లాకు ఒకరు, ఎన్టీఆర్ కమిషనరేట్‌కు ఇద్దరు అధికారులను నియమించారు.

పేరు	ప్రస్తుతం	బదిలీ ప్రాంతం
ఎస్.వి.డి.ప్రసాద్	అదనపు ఎస్పీ, కృష్ణా జిల్లా ఆర్మ్‌డ్ రిజర్వ్	డీసీపీ, సిటీ సెక్యూరిటీ వింగ్, ఎన్టీఆర్ పోలీస్ కమిషనరేట్
టి.ఆనంద్‌బాబు	ప్రిన్సిపల్, పీటీసీ విజయనగరం	కమాండెంట్, హోంగార్డ్స్ విభాగం విజయవాడ
బి.సత్యనారాయణ	అదనపు ఎస్పీ, కాకినాడ ఆర్మ్‌డ్ రిజర్వ్	అదనపు ఎస్పీ, కృష్ణా జిల్లా ఆర్మ్‌డ్ రిజర్వ్

ఆంధ్ర కల్చరల్ అసోసియేషన్ ఔదార్యం

గొల్లపూడి, న్యూస్‌టుడే: ఆంధ్ర కల్చరల్ అసోసియేషన్(కేరళ) ఆధ్వర్యంలో సంఘం అధ్యక్షుడు హరిహరనాయుడు విజయవాడ గ్రామీణ మండలం జక్కంపూడి, షాబాద గ్రామాల్లో 130 మంది వరద బాధితులకు కుక్కర్లు అందజేశారు. మరో మహిళ గుంజి ప్రియాంకకు రూ.25 వేలు ఆర్థిక సాయాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరద బాధితులను ఆదుకోవాలనే ఉద్దేశంతో సామాజిక బాధ్యతగా కేరళ నుంచి వచ్చి సాయం చేస్తున్నామన్నారు. సంఘం కోశాధికారి తిమ్మన మధు, తెదేపా నాయకుడు నేడూరు నరేంద్ర, పాల్గొన్నారు.



కుక్కర్లు అందజేస్తున్న ఆంధ్ర కల్చరల్ అసోసియేషన్ ప్రతినిధులు

ఎన్టీఆర్‌లో దండిగా.. కృష్ణాలో అరకొరగా

ఈనాడు - అమరావతి: ప్రైవేటు మద్యం దుకాణాలకు ఎన్టీఆర్ జిల్లాలో భారీగా స్పందన కనిపిస్తోంది. మరో రోజు గడువు ఉండగానే గురువారం రాత్రి ఎనిమిది గంటల వరకు 4,836 దరఖాస్తులు వచ్చాయి. శుక్రవారం రాత్రి 7 గంటల వరకు దరఖాస్తుల సమర్పణకు గడువు ఉంది. దీంతో చివరి రోజు ఈ సంఖ్య మరింత పెరిగే వీలుందని ఎక్సైజ్ అధికారులు భావిస్తున్నారు. తెలంగాణ రాష్ట్రంతో సరిహద్దు ఉన్న మండలాలకు ఎక్కువ ఆదరణ కనిపిస్తోంది. ఆ ప్రాంత దుకాణాలకు ఎక్కువ మంది ఆసక్తి చూపిస్తున్నారు. గురువారం కూడా ఇదే పరిస్థితి కనిపించింది.


సరిహద్దు దుకాణాలపై ఆసక్తి : జిల్లాలో తెలంగాణకు ఆనుకుని ఉన్న ప్రాంతాల్లోని షాపులకు దరఖాస్తుల వరద కొనసాగుతోంది. వత్సవాయి మండలంలో నోటిఫై చేసిన రెండు షాపులు బుధవారం రాత్రికే వంద దాటాయి. తాజాగా.. 96వ దుకాణానికి 117, 97వ దుకాణానికి 109 దరఖాస్తులు వచ్చాయి. పెనుగంచిప్రోలు మండలంలో ఐదు షాపులకు కూడా ఇదే స్పందన కనిపిస్తోంది. ఇదే మండలంలో 81వ దుకాణానికి 98, 84వ షాపునకు 74, 83వ దుకాణానికి 71 మంది దాఖలు చేశారు. కొండపల్లి పట్టణంలో నోటిఫై చేసిన రెండు షాపులకూ స్పందన వచ్చింది. 62, 68 చొప్పున దరఖాస్తులు దాఖలయ్యాయి. ఎ.కొండూరు, గంపలగూడెం మండలాల్లోని దుకాణాలకు 50 పైగా వచ్చాయి. విజయవాడ నగరంలో ఎక్సైజ్ శాఖ నోటిఫై చేసిన 39 దుకాణాలకు కూడా పెరుగుతున్నాయి. ఒక్కో షాపునకు సగటున 30 పైగా వచ్చాయి.

సిండికేట్లతో గండి : కృష్ణా జిల్లాలో చాలా ప్రాంతాల్లో సిండికేట్ల ప్రభావం ఎక్కువగా ఉంది. దీని కారణంగా దరఖాస్తులు తక్కువ సంఖ్యలో వస్తున్నాయి. వెరసి ప్రభుత్వ ఖజానాకు జమకావాల్సిన దరఖాస్తు రుసుముకు భారీగా గండిపడుతోంది. ప్రజాప్రతినిధులు, వారి అనుచరుల బెదిరింపులతో ఈ పరిస్థితి నెలకొంది. సిండికేట్‌గా ఏర్పడి వారే దరఖాస్తు చేస్తున్నారు. గుడివాడ పట్టణంలో ఏడు షాపులు నోటిఫై కాగా.. వీటికి నామమాత్రంగా వచ్చాయి. గుడివాడ మండలంలోని వాటికీ ఇదే రీతిలో పడ్డాయి. గన్నవరం నియోజకవర్గంలోని బాపులపాడు, ఉంగుటూరు మండలాల్లోని చాలా దుకాణాలకు అరకొరగానే దరఖాస్తులు వచ్చాయి. ఉయ్యూరు పట్టణం, మండలం, పెనమలూరు మండలంలోని దుకాణాలదీ ఇదే పరిస్థితి. గురువారం రాత్రికి కృష్ణా జిల్లాలో 1,987 దరఖాస్తులు మాత్రమే దాఖలయ్యాయి.

బాధాతప్త హృదయాలతో వీడ్కోలు



జ్యోత్స్న పార్థివదేహాన్ని ఎన్ఆర్ఐ వైద్య కళాశాలకు తీసుకెళ్తున్న కుటుంబ సభ్యులు, బంధువులు



రాజేంద్రప్రసాద్‌ను ఓదారుస్తున్న సీపీఎం నాయకులు బేబి, రాఘవులు తదితరులు

విజయవాడ (సీతారాంపురం), న్యూస్‌టుడే : కుటుంబ సభ్యులు, బంధువులు, వివిధ రంగాల ప్రముఖులు బాధాతప్త హృదయాలతో... ఏపీ బార్ కౌన్సిల్ సభ్యుడు సుంకర రాజేంద్రప్రసాద్ సతీమణి, సామాజిక కార్యకర్త గుళ్లపల్లి జ్యోత్స్న (55)కు అంతిమ వీడ్కోలు పలికారు. ప్రముఖులంతా తరలివచ్చి రాజేంద్రప్రసాద్‌ను, కుటుంబ సభ్యులను ఓదార్చారు. రాజస్థాన్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో జ్యోత్స్న మృతిచెందిన విషయం తెలిసిందే. విజయవాడ, సీతారాంపురంలోని సుంకర రాజేంద్రప్రసాద్ ఇంటి వద్ద నుంచి అంతిమ యాత్ర నిర్వహించారు. అనంతరం ఆమె పార్థివదేహాన్ని మంగళగిరిలోని ఎన్ఆర్ఐ ఆసుపత్రికి అప్పగించారు. ఈ ప్రదర్శనలో.. జ్యోత్స్న ఆశయాలు సాధిస్తామని దారి పొడవునా నినాదాలు చేశారు. కోర్టుల భవన సముదాయం వద్ద న్యాయవాదులు పూలమాలలువేసి నివాళులర్పించారు. రాష్ట్ర అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్, పర్వతనేని ప్రభాస్, పోతిన మహేష్ తదితరులు అంజలి ఘటించారు. అనంతరం ఎంబీవీకే భవన్ వద్దకు చేరిన జ్యోత్స్న భౌతికకాయానికి సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు, ఎంఏ బేబి, రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, సీపీఎం పూర్వ రాష్ట్ర కార్యదర్శి పి.మధు, కేంద్ర కమిటీ సభ్యులు ఎం.ఎ.గఫూర్ తదితరులు అంజలిఘటించారు. విద్యార్థి ఉద్యమం, శ్రామిక మహిళా ఉద్యమం, సీఐటీయూ, సీపీఎం.. ఇలా అనేక ఉద్యమాల్లో జ్యోత్స్న విశేష సేవలందించారని గుర్తు చేసుకున్నారు. మహిళా హక్కులపై అవగాహన, చైతన్య కార్యక్రమాలు నిర్వహించారని కొనియాడారు. అంతిమయాత్ర వాహనంలో సుంకర రాజేంద్రప్రసాద్‌తో పాటు కుమారులు, కోడళ్లు, ఇతర కుటుంబ సభ్యులతోపాటు సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చిగురుపాటి బాబూరావు తదితరులు ఉన్నారు. సీపీఎం, ఐద్వా, బాలోత్సవ్ భవన్ కమిటీ, రైతు సంఘం, సాహితీ స్రవంతి, ఎస్ఎఫ్ఐ, డప్పు కళాకారుల సంఘం, విజయవాడ బార్ కౌన్సిల్, వ్యాపారులు ఇలా అన్ని వర్గాల ప్రముఖులు, నాయకులు, సామాజిక కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలివచ్చి అంతిమ వీడ్కోలు పలికారు.

బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -120 రిటైల్ ధర 142 చికెన్ విత్ స్కిన్ - 206, చికెన్ స్కిన్‌లెస్ - 234.

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 128, 137, 148 చికెన్ విత్ స్కిన్ - 250 చికెన్ స్కిన్‌లెస్ - 260.

నెక్ సూచించిన కోడిగుడ్లు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 525 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.93/-.

చిన రాజగోపురం వద్ద బూట్లతో ఎస్సై హల్‌చల్

చిట్టినగర్, న్యస్‌టుడే : ఇంద్రకీలాద్రిపై చిన రాజగోపురం వద్ద ఓ ఎస్సై బూట్లతో అటూ.. ఇటూ తిరుగుతూ హల్‌చల్ చేశారు. ఇంద్రకీలాద్రిపై ఓం మలుపు వద్ద పోలీసు ఔట్‌పోస్టు ఏర్పాటు చేశారు. అక్కడ విధులు నిర్వహించే ఎస్సై రాజారెడ్డి గురువారం మధ్యాహ్నం సుమారు 12.10 గంటల సమయంలో తనకు కావాల్సిన వారిని వెంట పెట్టుకుని అమ్మవారి దర్శనానికి తీసుకెళ్లారు. వీవీఐపీ ప్రవేశ ద్వారం దాటి బూట్లతోనే లోపలకు ప్రవేశించారు. చినరాజగోపురం వద్ద అటూ ఇటూ కాసేపు తిరిగారు. అక్కడ నుంచి ఆ పక్కనే ఉన్న ఈవో పేషీకి వెళ్లే గేటు వద్ద కాసేపు బూట్లతోనే నిలబడ్డారు. వెంట తీసుకొచ్చిన వారిని దర్శనానికి పంపి తిరిగి డ్యూటీ పాయింట్‌కు వెళ్లారు. ఆలయంలో చెప్పులు, బూట్లు వంటివి నిషేధించినా పట్టించుకోని ఎస్సై రాజారెడ్డి తీరుపై భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 9వ తేదీన మూలానక్షత్రం రోజు మహిళా ఎస్సై ఓ చిన్నారి చెవిని మెలితిప్పిన ఘటన మరచిపోకముందే మరో ఎస్సై బూట్లతో ఆలయం చిన రాజగోపురం వద్ద తిరగడాన్ని భక్తులు ఆక్షేపిస్తున్నారు. పోలీసులు ఇష్టానుసారం వ్యవహరించకుండా ఉన్నతాధికారులు చర్యలు చేపట్టి ఆలయ పవిత్రతను కాపాడాలని భక్తులు కోరుతున్నారు.



ఈవో పేషీకి వెళ్లే గేటు వద్ద బూట్లతో ఎస్సై రాజారెడ్డి



మళ్లీ ఓం మలుపు వద్ద డ్యూటీ పాయింట్‌కు చేరుకున్న ఎస్సై రాజారెడ్డి(ఎత్తుగా ఉన్న వ్యక్తి)

సెలవుల్లోనూ విద్యుత్తు బిల్లులు చెల్లించొచ్చు

సూర్యారావుపేట: దసరా సందర్భంగా ఈ నెల 11, 12, 13 తేదీలు వరుసగా సెలవు దినాలైనప్పటికీ.. జిల్లాలోని అన్ని విద్యుత్తు బిల్లుల వసూలు కేంద్రాలు తెరిచి ఉంటాయని విద్యుత్తు సంస్థ ఎస్ఈ ఎ.మురళీమోహన్ తెలిపారు. అలాగే ఏపీసీపీడీసీఎల్ కస్టమర్ యాప్, గూగుల్‌పే, ఫోన్ పే, అమెజాన్ పే, బిల్ డెస్క్ యాప్‌ల ద్వారా చెల్లించవచ్చని చెప్పారు.

బీబీఏ సంతాప దినాలు

విజయవాడ నేరవార్తలు: బార్ కౌన్సిల్ సభ్యుడు సుంకర రాజేంద్రప్రసాద్ సతీమణి జోత్స్న అకాల మరణానికి చింతిస్తూ బెజవాడ బార్ అసోసియేషన్ సంతాప దినాలు పాటిస్తోంది. ఈ నెల 11 నుంచి 17వ తేదీ వరకు మొత్తం వారం రోజుల పాటు సంతాప దినాలుగా పాటించాలని అసోసియేషన్ ఏకగ్రీవంగా తీర్మానించిందని బీబీఏ ప్రధాన కార్యదర్శి శివరామప్రసాద్ తెలిపారు.

తిరువూరు

• తిరువూరు • మైలవరం

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
తిరువూరు: 85005 44088 మైలవరం: 80085 74705

? కొండపల్లి గుంటక్వారీకి వెళ్లే రహదారి చీకటి మయంగా ఉంది. విద్యుత్తు స్తంభాలు వేసినా వాటికి లైట్లు లేవు. కొన్ని చోట్ల ఉన్నా వెలగడం లేదు.
- సాంబశివరావు, స్థానికుడు

✔ స్తంభాలు, వాటికి విద్యుత్తు లైన్లు ఉన్నాయి. కొన్ని చోట్ల లైట్లు వెలగడం లేదు. ప్రాధాన్య క్రమంలో అన్ని చోట్లా లైట్లు వేసి వెలిగిస్తాం. **- పవన్, పారిశుద్ధ్య మేస్త్రీ**

- న్యూస్‌టుడే కొండపల్లి

ముగిసిన శిక్షణ తరగతులు

జి.కొండూరు, న్యూస్‌టుడే: స్థానిక సామాజిక భవనంలో గత రెండు రోజులుగా మండలంలోని పంచాయతీల్లో ఉప సర్పంచులు, వార్డు మెంబర్లకు సాధారణ పరిపాలనపై నిర్వహిస్తున్న శిక్షణ శిబిరం గురువారంతో ముగిసింది. గ్రామాల్లో పారిశుద్ధ్యం, వీధి దీపాల నిర్వహణ, ఆర్థిక కార్యకలాపాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ శ్రీనివాసరావు, కార్యదర్శి బసవలింగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నాలుగు మద్యం దుకాణాలకు 718 దరఖాస్తులు

తిరువూరు, న్యూస్‌టుడే: తిరువూరు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని నాలుగు మండలాల్లో 16 మద్యం దుకాణాలకు సంబంధించి గురువారం సాయంత్రం వరకు ఆఫ్ లైన్, ఆన్‌లైన్ ద్వారా 718 దరఖాస్తులు అందాయని సీఐ సత్య నారాయణవర్మ, ఎస్సై వెంకటకుమార్ తెలిపారు. దరఖాస్తుల గడువు శుక్రవారం సాయంత్రంతో ముగుస్తుందన్నారు.

మైలవరంలో 401

మైలవరం, న్యూస్‌టుడే: ఎక్సైజ్ మైలవరం సర్కిల్ పరిధిలోని 10 మద్యం దుకాణాలకు సంబంధించి గురువారం సాయంత్రం వరకు మొత్తం 401 దరఖాస్తులు అందాయని సీఐ జె.శ్రీనివాస్ తెలిపారు. అత్యధికంగా మైలవరం మండలంలో గల 4 దుకాణాలకు ఒక్కో దుకాణానికి 50కి పైగా దరఖాస్తులు వచ్చాయని వివరించారు. టెండర్లకు నేటితో గడువు ముగుస్తుందని పేర్కొన్నారు.

ఆనందించేలోపే ఆశలు ఆవిరి

దిగుబడి ప్రారంభంలోనే తగ్గుతున్న మొక్కజొన్న ధర

మైలవరం, న్యూస్‌టుడే

మంది ఎక్కువైతే మజ్జిగ పలచన చందంగా మారింది మొక్కజొన్న రైతుల పరిస్థితి. దిగుబడులు తక్కువగా ఉన్న సమయంలో పలికిన గరిష్ఠ ధర, పూర్తిస్థాయి దిగుబడి ప్రారంభంలోనే తగ్గిపోతోంది. దిగుబడులు తగ్గుతున్నా, ధరలతో పెట్టుబడులకు ఢోకా ఉండదని భావించే రైతులకు తగ్గుతున్న ధరలు నిరాశ కలిగిస్తున్నాయి.

మద్దతు కంటే తక్కువ

మొక్కజొన్నకు మద్దతు ధర క్వింటా రూ.2,225 గా ప్రభుత్వం ప్రకటించింది. ఈ ఏడాది అధిక వర్షాలతో ఖరీఫ్‌లో మొక్కజొన్న సాగు తగ్గగా, పంట దిగుబడులు లేకపోవడంతో మొన్నటి వరకు బహిరంగ మార్కెట్‌లో క్వింటా రూ.3 వేల వరకూ పలికింది. మద్దతు ధర కంటే ఎక్కువ ధరలు ఉండడంతో రైతులు తమ పూర్తిస్థాయి దిగుబడులు వస్తే ఈ ఏడాది లాభసాటిగా ఉంటుందని భావించారు. దాంతో వర్షాల్లోనే ఇబ్బందులు ఎదురైనా కొంత మేరకు సాగు చేశారు. నియోజకవర్గంలో ప్రస్తుతం సుమారు 800 ఎకరాల వరకు సాగు చేశారని అంచనా. గత వారం రోజులుగా మొక్కజొన్న కోతలు ముమ్మరంగా సాగిస్తున్నారు.



మైలవరం యార్డులో ఆరబెట్టిన మొక్కజొన్న

వ్యాపారుల వద్దే నిల్వలు

పంట దిగుబడులను మైలవరం చుట్టు పక్కల ప్రాంతాల నుంచి రైతులు స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీలో ఆరబెట్టుకుంటున్నారు. ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో క్వింటా రూ.2,200 ల చొప్పున కొనుగోలు చేస్తున్నారని, మద్దతు ధర కంటే తక్కువేనని రైతులు వాపోతున్నారు. గరిష్ఠ ధరలను చూసి ఆనందించే లోపే ధరలు తగ్గుతున్నాయని, దిగుబడులు పెరిగితే మరింత తగ్గే అవకాశం ఉందని అంటున్నారు. అయితే గతేడాది పండిన మొక్కజొన్నకు రూ.3 వేల చొప్పున ధరలు ఇస్తున్నట్లు చెబుతున్నారు. కానీ పంట పండించిన రైతులెవ్వరూ నిల్వ చేయలేదు. కేవలం రైతుల నుంచి కొనుగోలు చేసిన వ్యాపారుల వద్దే నిల్వలు ఉన్నాయని, వారికే ఆ లాభమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

'కార్మికులను తొలగిస్తే ఊరుకోం'

గొల్లపూడి, న్యూస్‌టుడే: పాఠశాలల్లో పని చేసే ఆయాలు, స్వీపర్లను తొలగిస్తే ఊరుకునేది లేదని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు పేర్కొన్నారు. పాఠశాలల్లో పని చేసే ఆయాలు, స్వీపర్లతో సమావేశాన్ని గొల్లపూడిలోని ఏఐటీయూసీ కార్యాలయంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిరుద్యోగులను తొలగించేది లేదంటూ ముఖ్య నాయకులు చెబుతున్నారని, మరో వైపు గ్రామ స్థాయిలో వారిని తొలగించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. ఎంఈవో, కార్మిక చట్టాల ప్రకారం రూ.21వేలు జీతం ఇవ్వాల్సి ఉన్నప్పటికీ రూ.6వేలు మాత్రమే ఇస్తున్నారన్నారు. నాయకులు జయకుమారి, సుబ్బయ్య, శివ బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఓబులేసు

బాధిత కుటుంబానికి సాయం

జి.కొండూరు, న్యూస్‌టుడే: వెల్లటూరుకి చెందిన వాటర్‌ట్యాంకు వాచర్‌గా పనిచేసే పసుపులేటి వెంకటేశ్వరరావు అనారోగ్యంతో గత రాత్రి మృతి చెందారు. దీంతో పంచాయతీ నిధులు సర్పంచి భర్త వేల్పూరి మరియన్న, కార్యదర్శి మురళి రూ.10 వేలను మట్టి ఖర్చుల నిమిత్తం మృతుడి కుటుంబ సభ్యులకు గురువారం అందజేశారు

ఇసుక సరఫరాపై ఆంక్షలు సడలించండి



ఆర్డీవో మాధురికి వినతిపత్రం అందజేస్తున్న దేవదత్, తెదేపా నాయకులు

తిరువూరు, న్యూస్‌టుడే: భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి కల్పించేందుకు ఇసుక సరఫరా చేయాలని తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి శావల దేవదత్ ఆర్డీవో కె.మాధురికి గురువారం వినతిపత్రం అందజేశారు. తిరువూరులోనే 1,500 మందికి పైగా భవన నిర్మాణ కార్మికులు ఉన్నారని ఇసుక కొరతతో 100 మందికి కూడా పనులు లభించడం లేదని ఆమెకు తెలిపారు. నియోజకవర్గంలో అందుబాటులో ఉన్న వాగుల్లో ఇసుకపై ఉన్న ఆంక్షలు సడలించి సరఫరా చేయాలని కోరారు. అంతకు ముందు పట్టణంలో సదరు కార్మికులతో సమావేశమై సమస్యలు తెలుసుకున్నారు. పండగ తర్వాత ఇసుక రవాణాకు అడ్డంకులు లేకుండా చూస్తానని, కార్మికులకు ఉపాధి కల్పించేందుకు చొరవ తీసుకుంటానని హామీ ఇచ్చారని నాయకులు తెలిపారు.

దోమల నివారణ పద్ధతులు పాటించండి



స్థానికులతో మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారిణి సుహాసిని

కొండపల్లి, న్యూస్‌టుడే: దోమల నివారణ పద్ధతులను పాటించి జ్వరాల నుంచి మనల్ని మనం కాపాడుకోవాలని జిల్లా వైద్యాధికారిణి సుహాసిని అన్నారు. కొండపల్లిలోని పలు ప్రాంతాల్లో వైద్య, పురపాలిక సిబ్బంది గురువారం పర్యటించారు. సీజనల్ వ్యాధులు విస్తృతంగా ఉన్నాయని.. అయితే డెంగ్యూ, మలేరియా వంటి ప్రాణాంతక వ్యాధులు లేవని స్థానికులు గుర్తించాలన్నారు. జ్వరాలు ఉన్న వారు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సేవలు పొందాలన్నారు. జ్వరాలపై ఇంటింటి సర్వే చేయాలని ఏఎన్ఎం, ఆశాలకు సూచించారు. అనంతరం కమిషనర్ కార్యాలయంలో కమిషనర్ శ్రీనివాసరావుతో సమావేశమై పారిశుద్ధ్య పరిస్థితులను తెలుసుకొన్నారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి మోతి, ఇబ్రహీంపట్నం యూనిట్ వైద్యాధికారి అప్పారావు, పీహెచ్‌సీ వైద్యులు పాల్గొన్నారు.

నిండుగా ప్రవహిస్తున్న సాగర్‌జలాలు

గంపలగూడెం, న్యూస్‌టుడే: సాగర్‌కాల్వల ఆయకట్టులో పంటలకు మూడు రోజులుగా సాగు నీరు పుష్కలంగా లభిస్తోంది. మేజర్ కాల్వలకు సామర్థ్యం మేరకు నీటి సరఫరా చేస్తున్నారు. అయితే మైనర్ కాల్వల పరిధిలో చివరి భూములకు నీరు చేరాల్సి ఉంది. మరో వారం రోజులు సరఫరా చేస్తేనే ఆయకట్టు చివరి భూములకు చేరుతుందని రైతులు తెలిపారు. గురువారం ఎన్నెస్పీ రెండో జోన్ పరిధిలోని మధిర బ్రాంచి కెనాల్‌కు కల్లూరు మండలం కప్పలబంధం నియంత్రిక వద్ద 1074 క్యూసెక్కుల సాగర్‌జలాలు విడుదల చేయగా గంపలగూడెం మండల సరిహద్దులోని 23వ కి.మీ వద్దకు 371 క్యూసెక్కులు చేరాయి.

ప్రభుత్వ పథకాలు అందేలా కృషి



ఎంపీడీవో హారిప్రియకు పుష్పగుచ్ఛం అందిస్తున్న గ్రామ సచివాలయ ఉద్యోగులు

ఎ.కొండూరు, న్యూస్‌టుడే: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా కృషి చేస్తానని నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎంపీడీవో పి.హారిప్రియ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం గ్రామ సచివాలయాల ఉద్యోగులు ఆమెను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలతో స్వాగతించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో సచివాలయాల ఉద్యోగులు కూడా సమయపాలన పాటిస్తూ విధులను బాధ్యతగా నిర్వహించాలని సూచించారు. మండలంలో అత్యధికంగా తండాలు, గిరిజన ప్రజలు ఉన్నందున తన దృష్టికి తీసుకువచ్చే సమస్యలను సత్వరమే పరిష్కరించి ప్రాధాన్యం మేరకు పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు.

రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలు ప్రారంభం




రిబ్బను కట్ చేస్తున్న తెదేపా నాయకులు, నిర్వాహకులు

గంపలగూడెం: దసరా, దీపావళి పర్వదినాలను పురస్కరించుకుని ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో గంపలగూడెం జడ్పీ ఉన్నత పాఠశాలలో ఉభయ తెలుగు రాష్ట్రాల స్థాయిలో నిర్వహించే వాలీబాల్ పోటీలను గురువారం తెదేపా గ్రామకమిటీ కె.రాధిక మార్ ప్రారంభించారు. దాతల ఆర్థిక సహకారంతో నిర్వహించే 'ఎన్టీఆర్ కప్ - 2024' పోటీల్లో వరుస మూడు స్థానాల విజేతలకు రూ.15వేలు, రూ.10వేలు, రూ.7,116, జ్ఞాపికలు అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు.

గీతకార్మికుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇవ్వాలి

పెనుగొలను(గంపలగూడెం), న్యూస్‌టుడే: మండలంలోని పెనుగొలనులో కల్లుగీత కార్మిక సంఘం సభ్యులు గురువారం సమావేశమయ్యారు. సంఘం రాష్ట్ర నాయకుడు వాకా వెంకటేశ్వరరావు పాల్గొని రాష్ట్రంలో కల్లుగీత కార్మికుల ఆర్థిక సహకార సంస్థ ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్పొరేషన్‌కు ఏటా రూ.వెయ్యి కోట్లు నిధులు కేటాయించి గీత కార్మికుల సంక్షేమం, ఆర్థికాభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వాలని సీఎం చంద్రబాబును కోరుతూ తీర్మానం చేశారు. గ్రామాధ్యక్షుడు పంది వెంకట్రావు, పి.ఉపేంద్ర, టి.చెన్నయ్య, టి.హరిబాబు, బి.కోటి, బి.రామకృష్ణ, పి.సత్యనారాయణ, టి.నరసింహ తదితరులు పాల్గొన్నారు.



నెమలి వేణుగోపాలస్వామి ఆలయంలో రూ.5లక్షలతో అలంకరణ

కొండపల్లి: దుర్గాదేవిగా

గొల్లపూడిలో..

ఇబ్రహీంపట్నం గ్రామీణం కోటికలపూడిలో

రెడ్డిగూడెంలో..

వెలగలేరులో

మైలవరంలో మహిళల పూజలు

దుర్గమ్మా.. దయచూపమ్మా

తిరువూరు మైలవరం నియోజకవర్గాల్లో దసరా ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. భక్తులు గురువారం అమ్మవారిని దుర్గాదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. **న్యూస్‌టుడే బృందం**

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం



స్థానిక జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో గురువారం 1994-95 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆత్మీయ సమావేశం నిర్వహించుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలు గుర్తుచేసుకొని ఆనందంగా గడిపారు. తమకు చదువు చెప్పిన ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. **- న్యూస్‌టుడే, రెడ్డిగూడెం**

ఈ పంట నమోదు పరిశీలన

ఎరుకోపాడు, చిక్కుళ్లగూడెం(తిరువూరు): మండలంలోని ఎరుకోపాడు, చిక్కుళ్లగూడెం రైతులు సాగు చేసిన పత్తి, మిరపలో ఈ పంట నమోదుపై ఆర్డీవో మాధురి గురువారం ర్యాండమ్ చెకింగ్ చేశారు. ఎరుకోపాడులో రైతు సాగు చేసిన పంటను కి.మీ దూరం పొలం గట్లపై నడుస్తూ జియో ట్యాగింగ్ ద్వారా నిర్దేశిత సర్వే నంబరు భూమిలో సాగు చేసిన పంటను పరిశీలించారు. వీఆర్వోలు, వీఏఏల పనితీరును రైతులను అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో జరిగే గ్రామ సభలకు హాజరై తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. డీటీ నాగమణి, డీఏఓ ఎస్.సారంగపాణి, మండల సర్వేయర్ ఎస్.గోపాలకృష్ణ, సీనియర్ సహాయకులు కె.రవికుమార్ ఆమె వెంట ఉన్నారు.

రతన్ టాటాకు నివాళి

తిరువూరు: ప్రముఖ పారిశ్రామికవేత్త రతన్ టాటా మృతి తీరని లోటని తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి శావల దేవదత్ అన్నారు. పట్టణంలోని తన కార్యాలయంలో గురువారం రతన్ టాటా చిత్రపటానికి తెదేపా నాయకులతో కలిసి నివాళులర్పించారు. లక్షల మందికి ఉపాధి కల్పించిన ఆదర్శనీయుడని కొనియాడారు.

మహిళ మెడలో గొలుసు చోరీ



దొంగతనం చేసిన వ్యక్తికి దేహశుద్ధి చేస్తున్న స్థానికులు

కొండపల్లి, న్యూస్‌టుడే: ఓ మహిళ మెడలో బంగారు గొలుసు చోరీకి యత్నించిన వ్యక్తిని స్థానికులు పట్టుకొని దేహశుద్ధి చేసిన సంఘటన కొండపల్లి ఆరు పంపుల కూడలిలో గురువారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..మద్దు అన్నపూర్ణ అనే మహిళ ఇంటి ముందు నిలబడి ఉండగా అటుగా వచ్చిన వ్యక్తి మహిళ ఒంటరిగా ఉండడం చూసి మెడలో ఉన్న గొలుసును లాక్కుని పరుగెత్తాడు. దీంతో ఆమె కేకలు

పట్టుకున్న స్థానికులు

వేయగా గమనించిన కొందరు యువకులు ఆ దొంగను పట్టుకొన్నారు. అనంతరం పోలీసులకు సమాచారం ఇచ్చి సదరు నిందితుడిని వివరాలు అడగ్గా మాది ఖమ్మం జిల్లా మదిర నియోజకవర్గంలోని జమలాపురం అని బదులిచ్చాడు. అయితే పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి రాకపోవడంతో స్థానికులే దొంగను స్టేషన్‌లో అప్పగించారు.

జాతీయరహదారిపై ట్రాఫిక్



దసరా పండుగ, సెలవుల నేపథ్యంలో ప్రజలు సొంతూర్లకు పయనమయ్యారు. దీంతో దీంతో విజయవాడ-హైదరాబాద్ జాతీయరహదారిపై గొల్లపూడి వద్ద ట్రాఫిక్ నిలిచిపోతోంది. **- న్యూస్‌టుడే, గొల్లపూడి**

విజయవాడ తూర్పు


రహదారిపై విద్యుద్దీపాల కాంతులు


వేదిక లోపల మిరుమిట్లు గొలిపేలా..

వెలుగులు విరజిమ్మి.. ఉత్సవాలు మిన్నంటి..

విజయవాడ గాంధీనగర్ సీతన్నపేటలో దసరా ఉత్సవాలు మిన్నంటుతున్నాయి. ఇక్కడ రూ.30 లక్షలతో అమ్మవారి వేదికను తీర్చిదిద్దారు. వంద మీటర్ల పొడవునా రంగు రంగుల విద్యుత్తు దీపాలతో అలంకరించారు. అమ్మవారిని ప్రతిష్ఠించిన వేదిక.. పువ్వులు, కుండలు, బుట్టల్లో దీపాలను అందంగా వేలాడదీశారు. సినీ సెట్టింగ్‌లను తలపించేలా మండపాన్ని ఎంతో ఆకర్షణీయంగా రూపుదిద్దారు.

- ఈనాడు, అమరావతి, న్యూస్‌టుడే, విజయవాడ (గాంధీనగర్)


పూజలందుకుంటున్న అమ్మవారు

ధరల స్థిరీకరణకు ప్రభుత్వం కృషి: గద్దె


కృష్ణలంక రైతుబజారులో పామాయిల్ ప్యాకెట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్

కృష్ణలంక, న్యూస్‌టుడే: ధరల స్థిరీకరించిన ఏకైక ప్రభుత్వం తెదేపా సర్కారని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. కృష్ణలంక రైతుబజారులో పామాయిల్, టమాటా, ఉల్లిపాయల రాయితీ ప్రత్యేక కౌంటర్‌ను గురువారం ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ నిత్యావసర వస్తువుల ధరలు పేద ప్రజలకు అందుబాటులో ఉండేలా ముఖ్యమంత్రి చంద్రబాబు చర్యలు చేపట్టారని చెప్పారు. వైకాపా ప్రభుత్వంలో ఎనిమిది సార్లు వరదలు వచ్చినప్పటికీ బాధితులకు ఒక్క రూపాయి పరిహారం ఇవ్వలేదన్నారు. కానీ చంద్రబాబు బాధితులకు కుటుంబానికి రూ.25వేలు అందించినట్లు తెలిపారు. ఇప్పుడు ఏముఖం పెట్టుకుని బాధితులకు వరద సాయం ఇవ్వాలంటూ ఆపార్టీ నాయకులు ధర్నా చేస్తారని ప్రశ్నించారు. వైకాపా వారి నాటకాలను ప్రజలు గమనిస్తున్నట్లు చెప్పారు.

'అన్యాయమంటూ రోడ్డెక్కడం హాస్యాస్పదం'

పటమట: వరదలతో విజయవాడ అతలాకుతలమై, లక్షలాది మంది ప్రజలు అవస్థలు పడితే ఏ రోజూ బాధితులకు అండగా నిలవని మాజీ సీఎం జగన్‌రెడ్డి, బాధితులకు అన్యాయం జరిగిందంటూ రోడ్డెక్కడం హాస్యాస్పదంగా ఉందని తెదేపా బీసీ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి వీరంకి వెంకట గురుమూర్తి ఎద్దేవా చేశారు. గురువారం ఆటోనగర్‌లోని జిల్లా పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ వరదల సమయంలో వైకాపా నాయకులు విహార యాత్రకు వచ్చినట్లు వచ్చి వెళ్లడం తప్ప..ఏ రోజైనా బాధ్యతగా మసలుకున్నారా అని ప్రశ్నించారు. బాధితులకు రూ.కోటి సహాయం ప్రకటించిన జగన్‌రెడ్డి ఆ సొమ్ము ప్రభుత్వానికి ఎప్పుడు ఇస్తారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. పడవలతో ప్రకాశం బ్యారేజీని ధ్వంసం చేసి జిల్లా మొత్తాన్ని నాశనం చేసేందుకు ప్రయత్నించారని మండిపడ్డారు. ప్రజల కోసం అహర్నిశలు శ్రమించిన ముఖ్యమంత్రి చంద్రబాబు గురించి నోరు జారితే సహించేది లేదని హెచ్చరించారు.

పటమట: వరదపై బురద రాజకీయం చేస్తున్న మాజీ సీఎం జగన్‌ను ప్రజలు అసహ్యించుకుంటున్నారని, జగన్ చెప్పే అబద్ధాలు వినలేక రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూడా బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెదేపా నాయకుడు మాదిగాని గురునాథం ఆగ్రహం వ్యక్తంచేశారు. గురువారం గురునానక్ కాలనీలోని ఎన్టీఆర్ భవన్‌లో ఆయన మాట్లాడుతూ ప్రజల తిరస్కరణ పొందిన జగన్‌కు రాజకీయ సన్యాసం తప్పదన్నారు.

'సాక్షి పత్రికపై చర్యలు తీసుకోండి'

పటమట: సాక్షి పత్రికలో ప్రచురిస్తున్న కథనాలు ప్రజల మధ్య శత్రుత్వం, ద్వేషాలు పెంచేలా ఉన్నాయని, ఆ పత్రికపై చర్యలు తీసుకోవాలని న్యాయవాది గూడపాటి లక్ష్మీనారాయణ గురువారం పటమట సీఐ వి.పవన్‌కిషోర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రశాంతంగా ఉన్న రాష్ట్రంలో అల్లర్లకు సాక్షి కుట్రలు పన్నుతూ అనుమానం వ్యక్తం చేశారు. తప్పుడు వార్తలను వ్యాప్తి చేయడం, అల్లర్లను ప్రేరేపించడం, ప్రజలను తప్పుదోవ పట్టించడం, వారి మధ్య ద్వేషం పెంచుతున్న సాక్షి పత్రిక, ఎడిటర్ వి.మురళిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. కోగంటి రామారావు, పరసపోగు రాజేశ్ తదితరులు పాల్గొన్నారు. దీనిపై న్యాయ సలహా కోసం పంపినట్లు సీఐ పవన్ కిషోర్ తెలిపారు.

రాష్ట్ర పోటీలకు జిల్లా జట్ల ఎంపిక

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: కాకినాడలో ఈ నెల 19 నుంచి జరిగే రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ సమాఖ్య (ఎస్‌జీఎఫ్) అండర్-19 బాలబాలికల రైఫిల్ షూటింగ్ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొనే జిల్లా జట్టును జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యనిర్వాహక కార్యదర్శి వి.రవికాంత గురువారం వెల్లడించారు. ★ **బాలుర విభాగం:** పి.హ్రితిక్‌హేమంత్‌రెడ్డి, ఎం.సాత్విక్, ఎన్.ఈషన్ శోభన్, ఎం.లోకేష్, ఎస్.సదీప్, ఎండీ అబ్దుల్ ముఫీక్ అహ్మద్, యశ్వంత్ సూర్య, ఎండీ నిజాముద్దీన్, కె.కల్యాణ్.

★ **బాలికల విభాగం:** అనూరాధ, కె.విద్యావల్లి, ఎన్.ధరణి ఐశ్వర్య, ఎస్.ఉన్నతి, పి.విష్ణుప్రియాణి, జరీనా, జి.ఫణిశ్రీ, కె.తయాబ్, జె.భార్గవి.

కొండంత అవస్థలు

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే

వైకాపా పాలనలో నిర్లక్ష్యం ఫలితంగా కొండ ప్రాంతాల్లో సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. ఎంతో మంది పేద, మధ్య తరగతి ప్రజలు ఇక్కడ నివసిస్తున్నారు. రోజువారీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. వీరు ఇంటి నుంచి బయటకు వెళ్లాలంటే మెట్లే దిక్కు. ఏళ్ల కిందట నిర్మించినవి కనుక ప్రస్తుతం ఇవి శిథిలావస్థకు చేరాయి. కొన్ని చోట్ల పూర్తిగా దెబ్బతిన్నాయి. దీంతో రాత్రి వేళ కొండ ప్రాంత వాసులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.


శిథిలమైన మెట్లు

ఏడో డివిజన్ గుమ్మడితోటలో గుహల పక్కన కొండపై సుమారు 70 కుటుంబాలు నివసిస్తున్నాయి. అక్కడ మెట్లు దెబ్బతిన్నాయి. వృద్ధులు, చిన్నారులు రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. వీధి దీపాలు దూరంగా ఉన్నందున కనిపించక రాత్రి పూట పడిపోతున్నామని స్థానికులు చెబుతున్నారు. పైగా పాములు సంచరిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వీధి దీపాలు ఏర్పాటు చేయాలని, మెట్లు సరిచేయాలని ఆ ప్రాంత వాసులు కోరుతున్నారు. శివగిరి ఆలయానికి ఈ మార్గంలో భక్తులు రాకపోకలు కొనసాగిస్తున్నారు. ఇటుగా వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని పలువురు భక్తులు వాపోతున్నారు. గత ప్రభుత్వంలో చేస్తాం అని ప్రజాప్రతినిధులు హామీ ఇవ్వడమేగాని పట్టించుకోలేదని స్థానికులు చెబుతున్నారు. శిథిలావస్థకు చేరిన వాటిని తొలగించి కొత్త వాటిని ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. వృద్ధుల అవసరం రీత్యా రెండు వైపులా గ్రిల్స్ ఏర్పాటు చేయాలని అధికారులు, ప్రజాప్రతినిధులను స్థానికులు కోరుతున్నారు. మెట్ల పక్కన ఉన్న వీధిదీపాలకు పిచ్చి మొక్కలు అల్లుకున్నాయి. వర్షం కురిసినప్పుడు ప్రమాదకరంగా ఉంటోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వీటిని తొలగించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


విద్యుత్తు స్తంభాలకు అల్లుకున్న తీగలు

స్వర్గపురిలో దహన సంస్కారాల నిలిపివేత


కృష్ణలంక, న్యూస్‌టుడే: విజయవాడ నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో నడుస్తున్న కృష్ణలంక స్వర్గపురిలో మరమ్మతుల నిమిత్తం ఈనెల 12, 13, 14వ తేదీల్లో దహన సంస్కారాలు తాత్కాలికంగా నిలిపి వేస్తున్నట్లు కమిషనర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఆహార భద్రతకు ప్రాధాన్యం

పటమట, న్యూస్‌టుడే: ఆహార భద్రతకు అధిక ప్రాధాన్యం ఇస్తూ రాజీ లేకుండా విధులు నిర్వహిస్తున్నట్లు జాయింట్ ఫుడ్ కంట్రోలర్ ఎన్.పూర్ణచంద్రరావు అన్నారు. దసరా ఉత్సవాల సందర్భంగా సత్వరం ఆహార, నీటి నమూనాలు పరీక్షలు నిర్వహించేందుకు ఫుడ్ సెఫ్టీ ఆన్ వీల్స్ అనే మొబైల్ వాహనం ఏర్పాటు చేశారు. ఈ వాహనం ద్వారా నగరంలోని పబ్లిక్, ప్రైవేట్ ప్రాంతాల్లో ఆహార, నీటి నమూనాలను సేకరించి వెంటనే పరీక్షలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ ఎం.శ్రీనివాసరావు, ఫుడ్ సెఫ్టీ ఆఫీసర్లు శ్రీకాంత్, గోపాలకృష్ణ, ఎనలిస్టులు రాజారావు, జయప్రకాశ్, నాగేశ్వర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహా స్వాప్నికుడు రతన్ టాటా

పటమట, న్యూస్‌టుడే: ప్రపంచ వ్యాపార దిగ్గజంగా ఎదిగి, తన సంస్థల ద్వారా వచ్చిన ఆదాయంలో 60 శాతం దానధర్మాలకు, సేవా కార్యక్రమాలకు కేటాయించిన మహోన్నత వ్యక్తి రతన్ టాటా అని, ఆయన మరణం దేశానికి తీరని లోటని జెడ్పీ మాజీ ఛైర్‌పర్సన్ గద్దె అనురాధ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దేశంలోనే ఉన్నత పారిశ్రామికవేత్తగా ఉన్న రతన్ టాటా సామాన్య జీవితం గడిపిన మహా స్వాప్నికుడని పేర్కొన్నారు.



పటమట దర్శిపేటలో స్థానికులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

పటమట(గుణదల), న్యూస్‌టుడే: రతన్ టాటా దేశ పారిశ్రామిక రంగానికే కాదు..ప్రపంచ పారిశ్రామిక రంగానికి ఆదర్శంగా నిలిచారని వైకాపా ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్ అన్నారు. గురువారం గుణదలలోని వైకాపా జిల్లా కార్యాలయంలో రతన్ టాటా చిత్రపటానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు.

పటమట: పారిశ్రామిక దిగ్గజం రతన్ టాటాకు నగరంలోని అనేక ప్రాంతాల్లో ప్రజలు ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి నివాళులర్పించారు.

లబ్బీపేట(విజయవాడ సిటీ), న్యూస్‌టుడే : దిగ్గజ వ్యాపారవేత్త రతన్ టాటా మృతికి ఏపీ ఛాంబర్ ఆఫ్ కామర్స్, ఇండస్ట్రీస్ ప్రతినిధులు గురువారం సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా కార్యాలయంలో రతన్ టాటా చిత్రపటానికి ఛాంబర్స్ రాష్ట్ర అధ్యక్షుడు పొట్లూరి భాస్కరరావు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టాటా ఒక పారిశ్రామికవేత్తగా దేశ ఆర్థికాభివృద్ధిలో భాగస్వాములయ్యారని, సామాజిక సేవలు ఎనలేనివని పేర్కొన్నారు. పారిశ్రామికవేత్తలు, వ్యాపారవేత్తలకు స్ఫూర్తిదాయకమన్నారు.


నివాళులర్పిస్తున్న ఛాంబర్స్ సభ్యులు

ఆదుకోవడానికి ముందుకురారు కానీ ధర్నాలు చేస్తారా?: ఎంపీ శివనాథ్

ఈనాడు, అమరావతి : విజయవాడను వరదలు ముంచెత్తినప్పుడు ప్రజల్ని ఆదుకోవడానికి ముందుకురాని జగన్ పేటీఎం బ్యాచ్‌లు నేడు ధర్నాలు చేస్తున్నాయని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ మండిపడ్డారు. వరద సాయం మీదా వాళ్లు బురదజల్లుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వీరి మాటల్ని ప్రజలు అసహ్యించుకొంటున్నారని మండిపడ్డారు. నిద్రాహారాలు మాని 12 రోజులు విజయవాడ కలెక్టరేట్‌లో ఉండి ముఖ్యమంత్రి చంద్రబాబు బాధితుల్ని ఆదుకొన్నారని గుర్తుచేశారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. "ఫైర్ ఇంజిన్లతో ఇళ్లు శుభ్రం చేయించి...చంద్రబాబు కొత్తఒరవడి సృష్టించారు. నష్టపోయిన ప్రతిఒక్కరికీ పరిహారం అందించాం" అని శివనాథ్ పేర్కొన్నారు.

భావితరాలకు వేద జ్ఞానం మార్గదర్శకం

➻ దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే : వేదజ్ఞానం భావితరాలకు మార్గదర్శకం కావాలని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అన్నారు. దసరా వేడుకలను పురస్కరించుకొని శ్రీదుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం గురువారం నిర్వహించిన వేదసభలో రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన వేదపండితులు చతుర్వేద స్వస్తి పలికారు. ఈ సందర్భంగా నాలుగు వందల మంది వేద పండితులకు రూ.5 వేల చొప్పున పారితోషికాన్ని రాష్ట్ర మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, సత్యకుమార్ యాదవ్, ప్రత్యేక అధికారి రామచంద్రమోహన్, ఈవో రామారావు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి ఆనం నేటి తరం, రేపటి తరాలకు వేద జ్ఞానం అందించేందుకు వేద సభలు దోహదపడతాయన్నారు. ప్రతి జిల్లాలోని ప్రధాన ఆలయంలో ఏడాదికి ఒక సారి వేదసభలు నిర్వహించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు అనుమతి కోరతామన్నారు. ఈ నెల 12న దసరా ఉత్సవాల ముగింపును పురస్కరించుకొని భవానీ దీక్షాధారులు పెద్ద ఎత్తున తరలి వచ్చే అవకాశం ఉన్నందున ఐదు దర్శనం కౌంటర్లలో ఉచితంగా భక్తులకు దర్శనం కల్పిస్తున్నామని ప్రకటించారు. ఈవో రామారావు, డిప్యూటీ ఈవో రత్నరాజు, వైదిక కమిటీ సభ్యులు శ్రీనివాసశాస్త్రి పాల్గొన్నారు.

తుది దశకు జాతీయ ర్యాంకింగ్ బ్యాడ్మింటన్ టోర్నీ

బాలుర డబుల్స్‌లో తమిళనాడు హవా

విజయవాడ (క్రీడలు), న్యూస్‌టుడే: నగరంలో జరుగుతున్న జాతీయ సబ్ జూనియర్ ర్యాంకింగ్ బ్యాడ్మింటన్ టోర్నీ తుది దశకు చేరుకుంది. సీహెచ్ ఆర్‌కే వీఎంసీ ఇండోర్ స్టేడియం, ఎస్ఏఏపీ ఇండోర్ స్టేడియంలో జరుగుతున్న పోటీల్లో గురువారం జరిగిన సెమీ ఫైనల్స్ ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగాయి. రాష్ట్ర షట్లర్లు పోరాడి వెనుదిరిగారు. బాలుర అండర్-15 డబుల్స్‌లో తమిళనాడుకు చెందిన షట్లర్లు ఫైనల్స్‌కు చేరుకున్నారు. అండర్-15 బాలికల విభాగం సింగిల్స్‌లో టాప్ సీడ్ షట్లర్ షైనా మనిముతు(కర్ణాటక), మోహిత పోలవరం (తమిళనాడు), బాలుర విభాగంలో మేధాన్ష్ శర్మ (మధ్యప్రదేశ్), డైలాన్ పి.తోచమ్ (మణిపూర్)లు ఫైనల్ బెర్త్ ఖరారు చేసుకోగా.. బాలికల డబుల్స్‌లో అనుష్క జెన్నిఫర్-దీక్షిత సింగ్ గోపీనాథ్ సింగ్ (తమిళనాడు), షరయు రంజనె-సొయర షెలార్ (మహారాష్ట్ర), బాలుర డబుల్స్‌లో షాహిద్ ఇబ్రహీం పీర్ అహ్మద్ బుహారి-అధవ్ సూర్య ఆర్.జె (తమిళనాడు), నిఖిల్ జైకుమార్-కవెయుగన్ కె.ఎ. (తమిళనాడు) జోడీలు సెమీస్‌లో తమ సమీప ప్రత్యర్థులపై విజయం సాధించి ఫైనల్‌లో ప్రవేశించాయి. అండర్-17 బాలికల విభాగం సింగిల్స్‌లో రిషిక నంది (ఢిల్లీ), పారుల్ చౌదరి (రాజస్థాన్), బాలుర సింగిల్స్‌లో సాయివాసన్ బి (తమిళనాడు), దేవ్ రూపారెలై (మహారాష్ట్ర)లు తమ సమీప ప్రత్యర్థులపై విజయం సాధించి ఫైనల్ బెర్త్ ఖరారు చేసుకున్నారు. సెమీ ఫైనల్స్‌లో వెనుదిరిగిన షట్లర్లకు తృతీయ స్థానం సాధించినట్లుగా నిర్వాహకులు ప్రకటించారు. రాత్రి జరిగిన బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమానికి రాష్ట్ర క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రామ్‌ప్రసాద్‌రెడ్డి, శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు అతిథులుగా హాజరై తృతీయ స్థానాల్లో నిలిచిన క్రీడాకారులకు వ్యక్తిగత పతకాలు, ప్రశంసా పత్రాలు అందించారు. ఫైనల్ పోటీలు శుక్రవారం జరుగుతాయని రాష్ట్ర బ్యాడ్మింటన్ సంఘం కార్యదర్శి పోలినేని అంకమ్మచౌదరి తెలిపారు.



షట్లర్‌కు పతకం, ప్రశంసా పత్రం అందిస్తున్న మంత్రి మండిపల్లి రామ్‌ప్రసాద్‌రెడ్డి, శాప్ ఛైర్మన్ రవినాయుడు, చిత్రంలో అంకమ్మచౌదరి


సిద్ధార్థ హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాల మైదానంలో...


లబ్బీపేట షిర్డీసాయిబాబా ఆలయంలో...


శ్రీదుర్గాదేవి అలంకారంలో త్రిశక్తిపీఠం కాళీమాత


రాణిగారితోట మహాశక్తి ఆలయంలో..


కృష్ణలంక వాసవీ భవనంలో...

కనకదుర్గా..కరుణించమ్మా..!

దేవీశరన్నవరాత్రి ఉత్సవాల్లో గురువారం అమ్మవారు కనకదుర్గగా భక్తులకు దర్శనమిచ్చారు. వివిధ ప్రాంతాల్లో కుంకుమార్చన చేశారు. చండీహోమం నిర్వహించారు. వివిధ ప్రాంతాల్లో అన్నదానం చేశారు..

- న్యూస్‌టుడే బృందం


అమ్మవారిని ఊరేగిస్తున్న భక్తులు


దత్తపీఠంలో


దర్శిపేటలో...


కనకదుర్గమ్మను దర్శించుకుని వేద పండితుల ఆశీర్వాదం తీసుకుంటున్న జడ్పీ మాజీ ఛైర్‌పర్సన్ గద్దె అనురాధ


కుంకుమ పూజల్లో పాల్గొన్న భక్తులు


హాజరైన భక్తులు

జాతీయ రహదారిపై నిలిచిన ట్రాఫిక్

కృష్ణలంక: విజయవాడ బస్సు స్టేషన్ నుంచి కనకదుర్గమ్మ వారధి వరకూ గంటల పాటు ట్రాఫిక్ నిలిచిపోయింది. గురువారం ఉదయం 10.30 గంటల సమయంలో గుంటూరు వైపునకు వెళ్లే వారధి మార్గం 3వ పిల్లరు వద్ద ఇంధనం అయిపోవడంతో ప్రైవేటు ట్రావెల్స్ బస్సు నిలిచిపోయింది. దీంతో డ్రైవర్ బస్సుకు తాళం వేసి ఆయిల్ తెచ్చుకునేందుకు వెళ్లాడు. అదే సమయంలో వారధి మధ్య భాగాన మరమ్మతుకు లోనైన ఒక కారు నిలిచిపోయింది. మరోవైపు వారధి చివరి భాగంలో ముందు వెళుతున్న కారును వెనుక నుంచి వచ్చిన కారు ఢీకొట్టడంతో డ్రైవర్ల మధ్య వాగ్వాదం నెలకొంది. దీంతో కృష్ణలంక జాతీయ రహదారిపై ట్రాఫిక్ స్తంభించి బస్సు స్టేషన్ వరకూ వాహనాలు బారులు తీరాయి. ట్రాఫిక్‌లో కొన్ని అంబులెన్స్‌లు సైతం ఇరుక్కుపోగా ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు పోలీసులకు 3 గంటలకు పైగా సమయం పట్టింది.


వారధి బౌద్ధ చక్రం వద్ద నిలిచిన వాహనాలు

ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ మోసం

కళ్యాణదుర్గం గ్రామీణం: ఉద్యోగాలు ఇప్పిస్తామని నమ్మబలికి రూ.లక్షలు వసూలు చేసుకొని తమను మోసం చేశారనని అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం నియోజకవర్గానికి చెందిన పలువురు బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం వారు కళ్యాణదుర్గం ప్రజావేదిక వద్దకు చేరుకొని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబుతో తమ బాధను చెప్పుకొన్నారు. కళ్యాణదుర్గం పట్టణంలోని ఆదర్శ పాఠశాలలో అతిథి ఉపాధ్యాయులుగా ఉద్యోగాలు ఇప్పిస్తామని 2022లో మమత (మదనపల్లి), అనిత (శ్రీకాకుళం), అవినాష్‌రెడ్డి (తిరుపతి), ఈశ్వర్ (విజయవాడ) అనే వ్యక్తులు తమను విజయవాడకు పిలిపించారన్నారు. తమ నుంచి సుమారు రూ.32 లక్షలు వసూలు చేశారని ఆరోపించారు. రెండేళ్లుగా వారి చుట్టూ తిరుగుతున్నా ఉద్యోగాలు ఇప్పించలేదని, డబ్బు తిరిగి ఇవ్వలేదని వాపోయారు. మోసం చేసిన వారందరూ వైకాపా నాయకుడు, మాజీ మంత్రి అనుచరులు కావడంతో పోలీసులు ఏం చేయలేకపోయారని ఆరోపించారు. ఎమ్మెల్యే స్పందిస్తూ ఈశ్వర్‌రెడ్డి అనే వ్యక్తికి ఫోన్ చేసి మాట్లాడారు. మమత, అనితకు మొత్తాన్ని ఇచ్చినట్లు అతడు చెప్పాడు. బాధితులకు నగదు ఎవరిస్తారని ఎమ్మెల్యే ప్రశ్నించగా ఎలాంటి సమాధానం రాలేదు. దీనిపై పూర్తి స్థాయి విచారణ చేపట్టి న్యాయం జరిగేలా చూస్తానని ఎమ్మెల్యే బాధితులకు హామీ ఇచ్చారు.

నందిగామ

•నందిగామ •జగ్గయ్యపేట

రతన్‌టాటా మృతి దేశానికి తీరని లోటు


జగ్గయ్యపేట: రతన్ టాటాకు నివాళులర్పిస్తున్న తాతయ్య తదితరులు


నందిగామ: పౌర సమాజ ఐక్యవేదిక ఆధ్వర్యంలో..


జగ్గయ్యపేట: రాఘవేంద్ర, కౌన్సిల్ ప్రతినిధుల నివాళి


పెనుగంచిప్రోలులో..


నందిగామ: భాజపా ఆధ్వర్యంలో..

నందిగామ, న్యూస్‌టుడే: దేశం గర్వించదగ్గ ప్రముఖ పారిశ్రామిక వేత్త రతన్‌టాటా మృతి దేశానికి తీరని లోటని తెదేపా సీనియర్ నాయకుడు వడ్డెల్లి సాంబశివరావు పేర్కొన్నారు. స్థానిక రథం సెంటర్‌లో గురువారం పౌర సమాజ ఐక్యవేదిక ఆధ్వర్యంలో ప్రతినిధులు రతన్‌టాటా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సాంబశివరావు మాట్లాడుతూ ఎంతో మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించిన మహనీయుడన్నారు. పౌర సమాజ ఐక్యవేదిక అధ్యక్షుడు పారేపల్లి సాయిబాబు మాట్లాడుతూ నైతికత, నిబద్ధత, దాతృత్వం, రాజీపడని విలువలతో అన్ని తరాలకు ఆదర్శంగా నిలిచారన్నారు. టాటా ట్రస్ట్ ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించారన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ మారం అమరయ్య, ప్రతినిధులు పరిశె మల్లికార్జునరావు, సముద్రాల నాగేశ్వరరావు, చిలకల వేణు, మౌలా, శ్యాం, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నందిగామ: దేశంలో పారిశ్రామికాభివృద్ధికి ప్రముఖ పారిశ్రామికవేత్త రతన్‌టాటా కృషి చేశారని స్థానిక ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య తెలిపారు. గురువారం ఒక ప్రకటనలో టాటా ట్రస్ట్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించారని చెప్పారు. విజయవాడ పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో ట్రస్టు ద్వారా అనేక మందికి ఉచిత వైద్యం అందించారని తెలిపారు. కార్పొరేట్ వైద్యశాలల్లో ఖరీదైన వైద్యాన్ని ఉచితంగా పేదలకు అందించి ఎంతో మంది ప్రాణాలు కాపాడారని చెప్పారు. సేవా కార్యక్రమాలకు రూ.వేల కోట్లు అందజేసి తమ ఉదారతను చాటుకున్నారన్నారు.

నందిగామ: స్థానిక పార్టీ కార్యాలయంలో గురువారం పారిశ్రామికవేత్త రతన్‌టాటా చిత్రపటానికి భాజపా నాయకులు ఘనంగా నివాళులర్పించారు. భాజపా నియోజకవర్గ కన్వీనర్ తొర్లికొండ సీతారామయ్య, నాయకులు చిరుమామిళ్ల శ్రీనివాసరావు, కొత్త సాంబశివరావు, పులిపాటి లక్ష్మణరావు, కృష్ణ, యరగొర్ల లక్ష్మణ్, గుత్తా బాలకృష్ణ, శివ, నవీన్, వెంకట్రావు పాల్గొన్నారు.

జగ్గయ్యపేట: రతన్‌టాటా మృతికి ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య, మాజీ మంత్రి నెట్టెం రఘురాం, మాజీ ఎమ్మెల్యే సామినేని ఉదయభాను, మున్సిపల్ ఛైర్మన్ ఆర్.రాఘవేంద్ర సహా పలువురు వేరు వేరు కార్యక్రమాల్లో సంతాపం తెలిపి ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. స్థానిక టాటా ఇన్సూరెన్స్ సంస్థ సహా పలు సంస్థల్లో ఘన నివాళులర్పించారు.

పామాయిల్ విక్రయ కేంద్రం ప్రారంభం


నూనె ప్యాకెట్ అందిస్తున్న ఎమ్మెల్యే తాతయ్య

జగ్గయ్యపేట, న్యూస్‌టుడే: పేదలకు నిత్యావసర సరకులను చౌకధరలకు అందించాలన్న ఉద్దేశంతో పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో రైతుబజార్లో ఏర్పాటు చేసిన పామాయిల్ కౌంటర్‌ను ఎమ్మెల్యే శ్రీరాంతాతయ్య గురువారం ప్రారంభించారు. కిలో రూ.115కి విక్రయిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

ప్రయాణికుల ప్రాంగణం.. సమస్యల నిలయం

నందిగామ, న్యూస్‌టుడే

నందిగామలోని ఆర్టీసీ బస్టాండ్‌లో కనీస సౌకర్యాలు లేక ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారు. విజయవాడ రోడ్డు పక్కనున్న ప్రాంగణం ద్వారా రెండు తెలుగు రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రయాణికులు రోజూ రాకపోకలు సాగిస్తుంటారు. రెండు రాష్ట్రాల్లోని పలు డిపోలకు చెందిన ఆర్టీసీ బస్సులు ఇక్కడికి వచ్చి వెళ్తుంటాయి. ఇంతటి ప్రాధాన్యం ఉన్నప్పటికీ ఏమాత్రం అభివృద్ధికి నోచుకోవట్లేదు. రెండు దశాబ్దాల నుంచి ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా సౌకర్యాలు మెరుగుపర్చలేదు. వైకాపా పాలనలో అభివృద్ధి పనులకు రుపాయి ఖర్చు చేయలేదు.

బస్టాండ్ భవనం వర్షం వస్తే కురుస్తుంది. గతంలో శ్లాబ్ పెచ్చులూడడంతో మరమ్మతులు చేయించారు. మళ్లీ వర్షం వస్తే కురుస్తుండడంతో ప్రయాణికులు అసౌకర్యానికి గురవుతున్నారు. తాగునీరు కుళాయిల వద్ద అపరిశుభ్రంగా తయారైంది. పాచిపట్టి ఘోరంగా ఉంది. వీటిని కనీసం శుభ్రం చేయట్లేదు. వీటి వద్ద తాగునీరు పట్టుకునేందుకు ప్రయాణికులు భయపడుతున్నారు. దీంతో మినరల్ వాటర్ సీసాలు కొనుగోలు చేయాల్సి వస్తోందని వాపోతున్నారు. బస్టాండ్‌లో ఉన్న రెండు ఫ్యాన్లలో ఒక్కటే తిరుగుతుంది. మరొకటి పని చేయట్లేదు. గత తెదేపా ప్రభుత్వ హయాంలో బస్టాండ్‌ను ఆధునికీకరించి ప్రయాణికులు కూర్చునేందుకు బల్లలు వేయించారు. ఎల్ఈడీ టీవీలు అమర్చగా ఇప్పుడు లేవు. అదే విధంగా గతంలో దాతల ఏర్పాటు చేసిన చల్లని తాగునీరు కూలర్ పాడైపోవటంతో తొలగించారు. ఇక టాయిలెట్లు అధ్వానంగా ఉంటున్నాయి. ఆరు బయట ఉన్న టాయిలెట్ల పరిస్థితి మరింత దారుణంగా ఉంది. బస్టాండ్ ప్రాంగణం అపరిశుభ్రంగా ఉండటం వల్ల దుర్వాసన వస్తుంది. దోమలు, ఈగలతో ఇబ్బంది పడుతున్నారు.


ఆర్టీసీ బస్టాండ్‌లో తిరగని ఫ్యాన్

కూర్చునేందుకు బల్లలేవ్..

బస్టాండ్‌లో ఉదయం, సాయంత్రం వేళల్లో రద్దీ ఎక్కువగా ఉంటుంది. బస్సుల కోసం వేచి చూస్తూ కూర్చునేందుకు తగినన్ని బల్లలు లేకపోవడంతో ప్రజలు ఇబ్బందిపడుతున్నారు. ఆరుబయటే ఎక్కువ సేపు నిలబడాల్సి వస్తోంది. దీనివల్ల వృద్ధులు, మహిళలు, చిన్నారులు అవస్థలు పడుతున్నారు. వేసవి, వర్షాకాలాల్లో మరిన్ని తిప్పలు. ఇప్పటికైనా ఆర్టీసీ బస్టాండ్‌లో సమస్యల పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.


అపరిశుభ్రంగా తాగునీటి కుళాయిలు

బద్రీనాథ్ పీఠాధిపతిని కలిసిన ఎమ్మెల్యే తాతయ్య

జగ్గయ్యపేట గ్రామీణం, న్యూస్‌టుడే: బద్రీనాథ్ పీఠాధిపతి జగద్గురు శంకరాచార్య అవిముక్తేశ్వరానంద సరస్వతి స్వామివారిని ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య గురువారం కలిశారు. గోప్రతిష్ఠ ఆందోళన కార్యక్రమంలో భాగంగా దేశవ్యాప్త పర్యటన చేస్తున్న స్వామి వారి కోసం జాతీయ రహదారిపై వెంకట సాయి ఫుడ్ ప్లాజా వద్ద ఎదురు చూస్తున్న భక్తులను, శ్రీరాం తాతయ్యలను కలిసి వారిని ఆశీర్వదించి విజయవాడ వెళ్లారు.

ప్రపంచ ఆహార దినోత్సవానికి ఆహ్వానం

జగ్గయ్యపేట, న్యూస్‌టుడే: వేడుకల్లో మిగిలిపోయిన ఆహారాన్ని వృథా చేయకుండా దశాబ్ద కాలానికి పైగా పేదలకు పంచుతున్న అన్నపూర్ణ సేవా సమితిని తాత్వికులు గెంటేల వెంకటరమణ అభినందించారు. శ్రీ గురుదామ్ ధర్మ క్షేత్రానికి గురువారం విచ్చేసిన సేవాసమితి ప్రతినిధులు ఈనెల 16న జరిగే ప్రపంచ ఆహార దినోత్సవానికి ఆహ్వానం పలికారు.

బస్టాండ్‌ను ఉపయోగంలోకి తెద్దాం

జగ్గయ్యపేట, న్యూస్‌టుడే: రూ.కోటితో నిర్మించి నిరుపయోగంగా ఉన్న జాతీయ రహదారి బస్టాండ్‌ని త్వరలోనే ఉపయోగంలోకి తెచ్చేలా చూద్దామని ఎమ్మెల్యే శ్రీరాంతాతయ్య అన్నారు. గురువారం మున్సిపల్ ఛైర్మన్ రంగాపురం రాఘవేంద్ర సహా పలువురు నాయకులతో కలిసి బస్టాండ్‌ను పరిశీలించారు. అధికారులతో చర్చించి చర్యలు తీసుకుంటామన్నారు.

రోడ్డు ప్రమాదంలో కారు దగ్ధం



మాగనూరు: తెలంగాణలోని నారాయణపేట జిల్లా మాగనూరు వద్ద గురువారం ప్రమాదవశాత్తు చెట్టును ఢీకొని కారు దగ్ధమైంది. ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేటకు చెందిన శ్రీనివాసరావు కుటుంబ సభ్యులతో మంత్రాలయం వెళ్తుండగా ఉదయం ఆరు గంటల సమయంలో కారు అదుపు తప్పి చెట్టును ఢీ కొట్టింది. ఆ సమయంలో కారులో నలుగురు పెద్దవారు, ముగ్గురు చిన్న పిల్లలు ఉన్నారు. అందరూ స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ప్రమాదం జరిగిన వెంటనే కారులో ఉన్న వారంతా దిగి పక్కకు వచ్చాక షార్ట్ సర్క్యూట్ జరిగి కారులో మంటలు చెలరేగాయి. అగ్నిమాపక దళ సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు.

పెనుగంచిప్రోలు మద్యం దుకాణాలకు గిరాకీ

నందిగామ, న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంతమైన పెనుగంచిప్రోలు మండలంలోని మద్యం దుకాణాలకు భారీగా డిమాండ్ వస్తోంది. ఈ మండలంలోని అయిదు దుకాణాలకు ఇప్పటికి 371 దరఖాస్తులు వచ్చాయి. శుక్రవారం దరఖాస్తుల స్వీకరణ గడువు ముగుస్తుందని నందిగామ ఎక్సైజ్ సీఐ బంగారురాజు తెలిపారు. నందిగామ ఎక్సైజ్‌స్టేషన్ పరిధిలో 16 దుకాణాలకు గురువారం వరకు 740 దరఖాస్తులు వచ్చాయన్నారు. పెనుగంచిప్రోలులో శ్రీతిరుపతమ్మ అమ్మవారి ఆలయం ఉంది. ఇక్కడకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తుంటారు. ఏటా అమ్మవారి తిరునాళ్లు జరుగుతుంటాయి. అమ్మవారికి భక్తులు మొక్కుబడులు చెల్లిస్తుంటారు. దీంతో ఇక్కడ మద్యం వ్యాపారం బాగుంటుందని వ్యాపారుల అంచనా. దీంతోపాటు ఈ మండలం తెలంగాణ రాష్ట్రానికి పక్కనే ఉండడంతో మరింత గిరాకీ ఉంటుంది. ఈపరిస్థితుల్లో మండలంలోని అయిదు దుకాణాలకు వరుసగా షాపు నెం: 80కి 66, 81కి 96, 82కి 69, 83, 84 లకు 70 చొప్పున దరఖాస్తులు రావడం గమనార్హం. ఆఖరిరోజు ఇంకా వస్తాయని అధికారులు అంచనా వేస్తున్నారు.

✦ చందర్లపాడు మండలంలో మూడు దుకాణాలకు ఇప్పటివరకు 128 దరఖాస్తులు వచ్చాయి. నందిగామ గ్రామీణ మండలంలోని రెండు దుకాణాలకు 79, పట్టణంలోని ఆరు దుకాణాలకు 171 వచ్చాయి.

✦ **కంచికచర్ల ఎక్సైజ్‌స్టేషన్ పరిధిలో..**తెలంగాణా సరిహద్దులో ఉన్న వీరులపాడు మండలంలోని రెండు దుకాణాలకు భారీ డిమాండ్ ఉంది. రెండింటికీ కలిపి 94 దరఖాస్తులు వచ్చాయని సీఐ తెలిపారు. కంచికచర్ల మండలంలో అయిదు దుకాణాలకు 164 వచ్చాయన్నారు.

రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలు ప్రారంభం

గంపలగూడెం: దసరా, దీపావళి పర్వదినాలను పురస్కరించుకుని ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో గంపలగూడెం జడ్పీ ఉన్నత పాఠశాలలో ఉభయ తెలుగు రాష్ట్రాల స్థాయిలో నిర్వహించే వాలీబాల్ పోటీలను గురువారం తెదేపా గ్రామాధ్యక్షుడు కె.రవికుమార్ ప్రారంభించారు. దాతల ఆర్థిక సహకారంతో నిర్వహించే 'ఎన్టీఆర్ కప్ - 2024' పోటీల్లో వరుస మూడు స్థానాల విజేతలకు రూ.15వేలు, రూ.10వేలు, రూ.7,116, జ్ఞాపికలు అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు.

అధికారుల గైర్హాజరుపై ఆగ్రహం

కంచికచర్ల, న్యూస్‌టుడే : పలు శాఖల అధికారులు సమావేశానికి హాజరు కాకపోవడంపై మండల పరిషత్తు సమావేశంలో సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వారిపై చర్యలు తీసుకునేలా సిఫార్సు చేయాలని సూచించారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో వైస్ ఎంపీపీ బండి మల్లికార్జునరావు అధ్యక్షతన గురువారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో సభ్యులు పలు సమస్యలను లేవనెత్తారు. నిత్యం వందల మంది రాకపోకలు చేసే కంచికచర్ల బస్సుస్టాండ్ అనేక సమస్యలతో కొట్టుమిట్టాడుతోందని, వాటిని వెంటనే పరిష్కరించాలని సభ్యులు కోరారు. వర్షం కురిస్తే ఆర్టీసీ బస్సుస్టాండ్ చెరువులా మారుతోందని, కనీస వసతులు లేవని సభ్యులు గుర్తు చేశారు. వాటిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళతామని ఆర్టీసీ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

కార్మికులను తొలగిస్తే ఊరుకోం

గొల్లపూడి, న్యూస్‌టుడే: పాఠశాలల్లో పని చేసే ఆయాలు, స్వీపర్లను తొలగిస్తే ఊరుకునేది లేదని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు పేర్కొన్నారు. పాఠశాలల్లో పని చేసే ఆయాలు, స్వీపర్లతో సమావేశాన్ని గొల్లపూడిలోని ఏఐటీయూసీ కార్యాలయంలో గురువారం నిర్వహించారు.

కనకదుర్గా.. కరుణించమ్మా..!


నందిగామలో కనకదుర్గమ్మగా శుకశ్యామలాంబ


వాసవీమాత ఆలయంలో...


పల్లగిరిపై..



కంచికచర్ల మహాలక్ష్మి ఆలయంలో..


కంచికచర్ల శివసాయి క్షేత్రంలో..

న్యూస్‌టుడే బృందం: దేవీశరన్నవరాత్రి ఉత్సవాల్లో గురువారం అమ్మవారు కనకదుర్గగా భక్తులకు దర్శనమిచ్చారు. పలు గ్రామాల్లో కుంకుమార్చన చేశారు. చండీహోమం నిర్వహించారు. వివిధ ప్రాంతాల్లో అన్నదానం చేశారు..


అమ్రిత సాయి ఇంజినీరింగ్ కళాశాలలో బతుకమ్మ ఆడుతున్న విద్యార్థినులు


మాగల్లులో బతుకమ్మలను ఊరేగిస్తున్న మహిళలు


పెనుగంచిప్రోలు తూర్పు బజార్‌లో


రామన్నపేటలో..


జగ్గయ్యపేటలో...


నవాబుపేటలో..


బలుసుపాడులో.

పాల ఉత్పత్తిదారులకు నగదు పంపిణీ

జగ్గయ్యపేట, న్యూస్‌టుడే: గత ఆర్థిక సంవత్సరంలో ఆర్జించిన లాభాల నుంచి రైతుల వాటా కింద కొణకంచి పాల ఉత్పత్తిదారుల సహకార సంఘంలోని 170 మంది పాల ఉత్పత్తిదారులకు రూ.4.82లక్షల మొత్తాన్ని చిల్లకల్లు క్లస్టర్ ప్రతినిధులు గురువారం అందించారు. సామినేని కోటేశ్వరరావు, కేవీ రమణ, రుక్మాంగధరరావు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

యంత్రం తగిలి కార్మికుడి మృతి

పరిటాల(కంచికచర్ల), న్యూస్‌టుడే : డోజరు యంత్రం తగిలి క్వారీ కార్మికుడు మృతి చెందాడు. ఎస్సై బోనగిరి రాజు తెలిపిన వివరాల ప్రకారం ఒడిశా రాష్ట్రానికి చెందిన దీపక్ దౌరి(19) పరిటాల సమీపంలోని శర్వాణి ఇండస్ట్రీస్ క్రషర్‌లో డోజరు యంత్ర సహాయకుడిగా పనిచేస్తున్నాడు. గురువారం అతను క్వారీలో పనిచేస్తుండగా గమనించని డోజరు డ్రైవర్ యంత్రాన్ని వెనక్కి నడపడంతో దీపక్ దౌరీకి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అతడిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మరణించాడు. డ్రైవరు అజాగ్రత్త కారణంగానే ప్రమాదం జరిగిందని మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు డోజరు డ్రైవర్ రాజశేఖర్‌ను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఉచిత ఇసుక హామీ నిలబెట్టుకోవాలి

వీరులపాడు, న్యూస్‌టుడే : వైకాపా పాలనలో ఇసుక విధానంతో కార్మికులు పనులు లేక తీవ్రంగా నష్టపోయారని, ప్రస్తుత ఎన్డీయే కూటమి ప్రభుత్వం సైతం అదే ధోరణి అవలంభించడం సరికాదని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు పి.వి.ఆంజనేయులు అన్నారు. వీరులపాడు సీపీఎం కార్యాలయంలో గురువారం నిర్వహించిన మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ...కార్మికులు పనులు దొరక్క తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన ఉచిత ఇసుక హామీని వెంటనే నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యుడు కోట కళ్యాణ్, మండల నాయకులు పాల్గొన్నారు.

'ఉనికి కోసమే వైకాపా నాయకుల ధర్నాలు'

నందిగామ, న్యూస్‌టుడే: విజయవాడలో తమ ఉనికి కోసమే వైకాపా నాయకులు వెల్లంపల్లి శ్రీనివాస్, దేవినేని అవినాష్‌లు ఆందోళనలు చేస్తున్నారని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఇన్‌ఛార్జి, తెదేపా నాయకురాలు యలగాల నూకానమ్మ యాదవ్ విమర్శించారు. నందిగామలో గురువారం ఒక ప్రకటనలో ఇటీవల వరదలు వచ్చినప్పుడు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కలక్టరేట్‌లో పదిరోజులు బస్సులోనే ఉండి బాధితులకు అన్ని విధాల అండగా ఉన్నారన్నారు. అలాంటి గొప్పనాయకుడు చంద్రబాబును విమర్శించే అర్హత వైకాపా నాయకులకు లేదన్నారు. మాజీ సీఎం జగన్‌రెడ్డి రూ.కోటి సహాయం ప్రకటించి ఇప్పటికీ ఇవ్వలేదని విమర్శించారు.

విజయవాడ పశ్చిమ

జాతీయ రహదారిపై నిలిచిన ట్రాఫిక్

కృష్ణలంక, న్యూస్‌టుడే: విజయవాడ బస్సు స్టేషన్ నుంచి కనకదుర్గమ్మ వారధి వరకూ గంటల పాటు ట్రాఫిక్ నిలిచిపోవడంతో ప్రజలు నరకాన్ని చవిచూడాల్సి వచ్చింది. గురువారం ఉదయం 10.30 గంటల సమయంలో గుంటూరు వైపునకు వెళ్లే వారధి మార్గం 3వ పిల్లరు వద్ద ఇంధనం అయిపోవడంతో ప్రైవేటు ట్రావెల్స్ బస్సు నిలిచిపోయింది. దీంతో డ్రైవర్ బస్సుకు తాళం వేసి ఆయిల్ తెచ్చుకునేందుకు వెళ్లాడు. అదే సమయంలో వారధి మధ్య భాగాన మరమ్మతుకు లోనైన ఒక కారు నిలిచిపోయింది. ఇదే సమయంలో వారధి చివరి భాగంలో ముందు వెళ్తున్న కారును వెనుక నుంచి వచ్చిన కారు ఢీకొట్టడంతో డ్రైవర్ల మధ్య వాగ్వాదం నెలకొంది. దీంతో కృష్ణలంక వద్ద జాతీయ రహదారిపై ట్రాఫిక్ స్తంభించి బస్సు స్టేషన్ వరకూ వాహనాలు బారులు తీరాయి. ట్రాఫిక్‌లో కొన్ని అంబులెన్స్‌లు సైతం ఇరుక్కుపోగా ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు పోలీసులకు 3 గంటలకు పైగా సమయం పట్టింది. ఆ సమయంలో వాహనదారులు తీవ్రంగా ఇబ్బందులు పడ్డారు.


వారధిపై నిలిచిన ట్రావెల్స్ బస్సు

వీఐపీ వాహనాలతో రద్దీ

భవానీపురం, న్యూస్‌టుడే : వీఐపీ పాసులున్న వాహనాలతో దుర్గగుడి ఘాట్ రోడ్డు రద్దీగా మారింది. ప్రజాప్రతినిధులు, అధికారులు, తదితరులకు పాసులు మంజూరు చేశారు. అలాగే భవానీ, పున్నమి ఘాట్‌లు, ప్రభుత్వ అతిథి గృహం, తదితర ప్రాంతాల నుంచి వాహనాలను కొండ మీదకు వెళ్తున్నాయి. వాటికి వాహన పాసులను మంజూరు చేశారు. దీంతో కొండ మీదకు వెళ్లేందుకు గాలిగోపురం వద్ద వాహనాలు బారులు తీరి ఉంటున్నాయి.


ఘాట్ రోడ్డులో వెళ్లేందుకు ఉన్న వాహనాలు

ఆదుకోవడానికి ముందుకురారు కానీ ధర్నాలు చేస్తారా?

ఈనాడు, అమరావతి : విజయవాడను వరదలు ముంచెత్తినప్పుడు ప్రజల్ని ఆదుకోవడానికి ముందుకు రాని జగన్ పేటీఎం బ్యాచ్‌లు నేడు ధర్నాలు చేస్తున్నాయని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ మండిపడ్డారు. వరద సాయం మీద వాళ్లు బురదజల్లుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నిద్రాహారాలు మాని 12 రోజులు విజయవాడ కలెక్టరేట్‌లో ఉండి ముఖ్యమంత్రి చంద్రబాబు బాధితుల్ని ఆదుకున్నారని గుర్తుచేశారు. ఫైర్ ఇంజిన్లతో ఇళ్లు శుభ్రం చేయించి.. ప్రతిఒక్కరికీ పరిహారం అందించామని ఆయన పేర్కొన్నారు.

అమ్మదయ ఉంటే.. అన్నీ ఉన్నట్లే

ఇంద్రకీలాద్రిపై బాలపూజకు పెరిగిన భక్తులు

చిట్టినగర్, న్యూస్‌టుడే

దేవీశరన్నవరాత్రుల్లో భాగంగా దుర్గమ్మ సన్నిధిలో బాలికలకు పూజ చేయిస్తే నవరాత్రుల వ్రతం పరిపూర్ణం అవుతుందని పురాణాలు చెబుతున్నాయి. బాల పూజ 2 నుంచి 10 ఏళ్ల లోపు బాలికలకు మాత్రమే చేస్తారు. ఈ అర్చన చేయిస్తే సాక్షాత్తు అమ్మవారు సంతోషించి అఖండమైన ఆయురారోగ్యాలు, కుటుంబ సభ్యులకు, స్త్రీలకు సౌభాగ్య సంపత్తులు ప్రసాదిస్తుందని భక్తుల విశ్వాసం. అందుకే అమ్మవారి సన్నిధిలో తమ చిన్నారులకు బాలపూజ చేయించేందుకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివస్తుంటారు. ఈ పూజ చేయించుకునే వారి సంఖ్య పెరుగుతోందని అర్చకులు పేర్కొంటున్నారు. బాల పూజ చేయించుకున్న వారు తమ మనోభావాలను 'న్యూస్‌టుడే'తో ఇలా పంచుకున్నారు.


బాలస్వరూపిణిగా భావించి మొక్కుతున్న అర్చకులు

బాల అమ్మవారిగా భావించి



మేము బాల పూజ చేయించుకునేందుకు పెద్దాపురం నుంచి అమ్మవారి సన్నిధికి వచ్చాం. బాల పూజ చేయించుకుంటే చాలా మేలు జరుగుతుందని తెలిసి మా మేనకోడలు అనన్యకు పూజ చేయించాం. సాక్షాత్తు బాల అమ్మవారికి పూజ చేయించినట్లు భావించి అమ్మవారు కరుణాకటాక్షాలు చూపుతుందని మా భావన. అమ్మదయ ఉంటే అన్నీ ఉన్నట్లే. అందుకే అంత దూరం నుంచి వచ్చాం. అమ్మవారిని బాలస్వరూపులుగా భావించి అర్చకులు, పండితులు, పెద్దలు సైతం బాలలకు మొక్కుతారు. - బి. పావని, పెద్దాపురం

దుర్గతులు తొలగుతాయని



బాలపూజకు ఎంతో ప్రాధాన్యం ఉంది. బాలికలు సాక్షాత్తు అమ్మవారి స్వరూపులని భావిస్తారు. బాల పూజ చేయిస్తే ఇంటిల్లిపాదికి మేలు జరుగుతుందని దుర్గతులు తొలగి, సకల సౌఖ్యాలు కలుగుతాయని విశ్వాసం. బాలలకు మొక్కితే భగవత్ స్వరూపమైనా బాల అమ్మవారు సాక్షాత్కరించి కష్టాలు తీరుస్తారనే నమ్మకం ఉంది. నవరాత్రులలో మేం ఈ పూజ మా కుమార్తె శ్రీవల్లికి చేయించుకున్నాం.
- ఎం.వెంకటలక్ష్మి, అయోధ్యనగర్

బెంగళూరు నుంచి వచ్చాం



బాలపూజ చేయిస్తే పిల్లలకు, పెద్దలకు ఆ కుటుంబానికి మంచి జరుగుతుందని పండితులు, పెద్దలు చెబుతున్నారు. అందుకే 4వ తరగతి చదువుతున్న మా పాప ఆరాధ్యకు పూజ చేయించాలని బెంగళూరు నుంచి ప్రత్యేకంగా వచ్చాం. పూజలో పాల్గొన్నాం. ఈ అర్చన చేయిస్తే అమ్మవారు మెచ్చి సర్వ సంపదలు ప్రసాదిస్తుందని, ప్రధానంగా ఆరోగ్య సమస్యలు లేకుండా కాపాడుతుందని నమ్మకం.
- సిహెచ్.అరుణ, బెంగళూరు


విశ్రాంత హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బాలయోగికి అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న వేదపండితుడు


రాష్ట్ర మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు చిత్రపటం అందజేస్తున్న ఈవో రామారావు


ఆశీర్వచన మండపంలో ప్రముఖ నిర్మాత ఎ.ఎం రత్నం కుటుంబం


రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ కృష్ణతేజకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న డిప్యూటీ ఈవో రత్నంరాజు

జగన్మాత సేవలో ప్రముఖులు

ఇంద్రకీలాద్రి, చిట్టినగర్, న్యూస్‌టుడే : దసరా వేడుకల్లో ఇంద్రకీలాద్రిపై దుర్గాదేవి అలంకారంలో దర్శనమిచ్చిన జగన్మాతను విశ్రాంత హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బాలయోగి, రాష్ట్ర మంత్రి సత్యకుమార్ యాదవ్ గురువారం దర్శించుకున్నారు. అధికారులు వారికి ఆలయమర్యాదలతో స్వాగతం పలికారు. దర్శనం అనంతరం వేదపండితులు ఆశీర్వచనం చేశారు. ఈవో రామారావు వారికి అమ్మవారి చిత్రపటం, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

❖ కూటమి ప్రభుత్వంలో రాష్ట్రంలోని అన్ని దేవాలయాల్లో ఆధ్యాత్మికతకు పెద్దపీట వేశారని, భక్తులు సంతృప్తికరంగా ఉన్నారని విజయనగరం పార్లమెంటు సభ్యుడు కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. ఇంద్రకీలాద్రిపై దుర్గాదేవి అలంకారంలో ఉన్న అమ్మవారిని గురువారం దర్శించుకున్నారు. క్యూలైన్లలో భక్తులతో మాట్లాడుతూ ఇంద్రకీలాద్రిపైకి వచ్చానని ఆయన చెప్పారు. ఏర్పాట్లపై చాలా సంతృప్తి వ్యక్తం చేశారని వివరించారు. రాష్ట్ర ప్రజలపై అమ్మ దయ ఉండాలని వేడుకున్నట్లు తెలిపారు.

❖ గుంటూరు జిల్లా పరిషత్ మాజీ ఛైర్మన్, భాజపా నాయకుడు పాతూరి నాగభూషణం సతీసమేతంగా అమ్మవారిని దర్శించుకొని పట్టు వస్త్రాలు సమర్పించారు. మాజీ ఎమ్మెల్సీ, తెదేపా రాష్ట్ర కార్యదర్శి బుద్దా వెంకన్న దుర్గాదేవి అలంకారంలో అమ్మవారిని దర్శించుకున్నారు.

8వ రోజు ఆదాయం రూ.64.70 లక్షలు

దసరా ఉత్సవాల్లో 8వ రోజు గురువారం దర్శనం టిక్కెట్లు, ప్రసాదాల విక్రయాలు, ఆర్జిత సేవల ద్వారా రూ. 64.70లక్షల ఆదాయం వచ్చింది. రూ.500, రూ.300, రూ.100 దర్శనం టిక్కెట్ల ద్వారా రూ. 20,91,500, 5,31,900, రూ. 3,31,000 ఆదాయం సమకూరింది. లడ్డూ ప్రసాదాల విక్రయాల ద్వారా 30,60,720, తలనీలాల టోకెన్ల ద్వారా రూ.2,66,920 ఆదాయం లభించింది.

భావితరాలకు వేద జ్ఞానం మార్గదర్శకం

➡ దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే : వేదజ్ఞానం భావితరాలకు మార్గదర్శకం కావాలని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అన్నారు. దసరా వేడుకలను పురస్కరించుకొని శ్రీదుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం గురువారం నిర్వహించిన వేదసభలో రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన వేదపండితులు చతుర్వేద స్వస్తి పలికారు. ఈ సందర్భంగా నాలుగు వందల మంది వేద పండితులకు రూ.5 వేల చొప్పున పారితోషికాన్ని రాష్ట్ర మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, సత్యకుమార్ యాదవ్, ప్రత్యేక అధికారి రామచంద్రమోహన్, ఈవో రామారావు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి ఆనం నేటి తరం, రేపటి తరాలకు వేద జ్ఞానం అందించేందుకు వేద సభలు దోహదపడతాయన్నారు. ప్రతి జిల్లాలోని ప్రధాన ఆలయంలో ఏడాదికి ఒక సారి వేదసభలు నిర్వహించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు అనుమతి కోరతామన్నారు. ఈ నెల 12న దసరా ఉత్సవాల ముగింపును పురస్కరించుకొని భవానీ దీక్షాధారులు పెద్ద ఎత్తున తరలి వచ్చే అవకాశం ఉన్నందున ఐదు దర్శనం క్యూలైన్లలో ఉచితంగా భక్తులకు దర్శనం ఇవ్వాలని నిర్ణయించినట్లు ప్రకటించారు. ఈవో రామారావు, డిప్యూటీ ఈవో రత్నంరాజు, వైదిక కమిటీ సభ్యులు శ్రీనివాసశాస్త్రి పాల్గొన్నారు.



వేదపండితులను సత్కరిస్తున్న మంత్రి రామనారాయణరెడ్డి, సత్యకుమార్‌యాదవ్, ఈవో రామారావు, సభకు హాజరైన పండితులు

రతన్ టాటా మృతి ప్రపంచానికే తీరని లోటు


రతన్ టాటా చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న కృష్ణాపాల సమితి ఛైర్మన్ ఆంజనేయులు, ఎం.డి. ఈశ్వరబాబు, సమితి అధికారులు

చిట్టినగర్: దిగ్గజ పారిశ్రామికవేత్త రతన్‌టాటా మృతి యావత్ ప్రపంచానికి తీరని లోటని కృష్ణా పాల సమితి ఛైర్మన్ చలసాని ఆంజనేయులు అన్నారు. విజయ డెయిరీ కార్యాలయంలో రతన్‌టాటా చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విలువలు, మానవత్వంతో కూడిన వ్యాపార సామ్రాజ్యాన్ని నిర్మించిన మహా దార్శనికుడని కొనియాడారు. దేశాభివృద్ధి, ప్రజాశ్రేయస్సు, ఉద్యోగుల సంక్షేమమే పరమావధిగా జీవితాంతం కృషి చేసిన మహోన్నతుడు రతన్‌టాటా అని శ్లాఘించారు. మేనేజింగ్ డైరెక్టర్ ఈశ్వరబాబు, అధికారులు నివాళి అర్పించారు.

మనస్తాపంతో ఆటోడ్రైవర్ బలవన్మరణం

చిట్టినగర్, న్యూస్‌టుడే : భార్య కాపురానికి రావడం లేదని భర్త బలవన్మరణానికి పాల్పడిన ఘటన గురువారం జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. కేసుమల్లి వెంకటరమణ(35), వెంకటలక్ష్మి దంపతులు వైఎస్ఆర్ కాలనీలో ఉంటున్నారు. భర్త ఆటో డ్రైవర్. వారికి పాప, బాబు సంతానం. మద్యానికి బానిసై అప్పులు చేశాడు. కుటుంబ పోషణ పట్టించుకోకపోవడంతో భార్య పుట్టింటికి వెళ్లింది. కాపురానికి రాకపోవడంతో మనస్తాపం చెంది ఈ నెల 10వ తేదీన వంటగదిలో ఉరివేసుకున్నాడు. అతని బావమరిది సాయంత్రం వచ్చి చూడగా వేలాడుతూ కనిపించాడు. ఈ మేరకు కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరికి గాయాలు

చిట్టినగర్, న్యూస్‌టుడే : గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరు గాయాలపాలయ్యారు. పోలీసుల వివరాల ప్రకారం.. వించిపేట, నైజాంగేటు ప్రాంతంలో షేక్ ఆరిఫ్(50) అనే వ్యక్తి బ్యానర్లు కట్టడం, పెయింట్ పని చేస్తారు. నైజాంగేటు ప్రాంతంలోనే తిరుగుతుంటారు. ఈ నెల 10వ తేదీ గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో కిందపడగా తలకు గాయమైందని బాధితుడు చెబుతున్నారు. కాగా ఎవరో సైకో దాడి చేయడం వల్లే గాయమై ఉండవచ్చని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. నైజాంగేటు నుంచి పశ్చిమ బుకింగ్ వద్ద పాతదుస్తులు అమ్ముకునే ప్రాంతానికి వెళ్లాడు. అక్కడ నుంచి చికిత్స నిమిత్తం ఆటోలో ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లాడు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు కొత్తపేట పోలీసులు తెలిపారు.

స్వర్గపురిలో దహన సంస్కారాల నిలిపివేత

కృష్ణలంక, న్యూస్‌టుడే: విజయవాడ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నడుస్తున్న కృష్ణలంక స్వర్గపురిలో మరమ్మతుల నిమిత్తం ఈనెల 12, 13, 14వ తేదీల్లో దహన సంస్కారాలు తాత్కాలికంగా నిలిపి వేస్తున్నట్లు కమిషనర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.


దుర్గాదేవిగా చిట్టినగర్ అమ్మవారు


పాలఫ్యాక్టరీ వద్ద ..



వీఎంసీకాలనీలో..


బెజ్జాలమేడ వీధిలో..


అబ్దుల్‌ఖాదర్ వీధిలో..



భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామికి పట్టువస్త్రాలు తీసుకొస్తున్న పశ్చిమ ఎమ్మెల్యే సుజనాచౌదరి, ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణ

దుష్ట సంహారిణి.. శక్తి స్వరూపిణి


క్యారీసెంటరులో కనకదుర్గగా ..

చిట్టినగర్, న్యూస్‌టుడే : దసరా ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. గురువారం 8వ రోజున అమ్మవారిని దుర్గాదేవి అలంకారంలో భక్తులు దర్శించుకున్నారు. చిట్టినగర్‌లోని కొత్త అమ్మవారి ఆలయంలో, పాలఫ్యాక్టరీ వద్ద విజయదుర్గ, భీమనవారి పేట గంగానమ్మ, వీఎంసీ కాలనీలోని కనకదుర్గ, కేబీఎన్ కళాశాల ప్రాంగణంలోని దాసాంజనేయ స్వామి, కొత్తపేట గంగానమ్మ ఆలయాల్లో, బెజ్జాలమేడవీధిలోని పద్మనాభ వీఎల్‌సీసీఎస్ కంపెనీ ఆధ్వర్యంలో, మహంతిపురంలోని అబ్దుల్ ఖాదర్‌వీధిలోని శాంభవీమాతతా సేవాసమితి ఆధ్వర్యంలో, భీమనవారిపేట గంగానమ్మ గుడిలో దుర్గాదేవిగా అలంకరించారు.

విద్యాధరపురం: వన్‌టౌన్ పాతశివాలయంలో భ్రమరాంబదేవిని దుర్గమ్మగా అలంకరించారు. భక్తులు కుంకుమార్చనలు చేశారు. వన్‌టౌన్ పోలీసుస్టేషనులో కనకదుర్గాదేవి విగ్రహానికి పూజలు చేశారు. క్యారీ సెంటరులో కనకదుర్గా సేవా సమితి ఆధ్వర్యంలో అమ్మవారిని దుర్గాదేవిగా అలంకరించారు.


దాసాంజనేయ ఆలయంలో..


పాతశివాలయంలోని భ్రమరాంబదేవి


వన్‌టౌన్ పీఎస్‌లో..

విద్యాధరపురం, న్యూస్‌టుడే: వన్‌టౌన్‌లోని శ్రీభ్రమరాంబ సమేత మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో దసరా ఉత్సవాలను పురస్కరించుకొని అమ్మవారికి పశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరి, ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణ పట్టువస్త్రాలు సమర్పించారు. అన్నప్రసాద పంపిణీ ప్రారంభించారు. భాజపా ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్, అర్చకుడు నాగరాజశర్మ పాల్గొన్నారు.


భక్తులకు అన్నప్రసాదం


చిన్నారులకు ధ్రువపత్రాల అందజేత



రహదారిపై విద్యుద్దీపాల కాంతులు


వేదిక లోపల మిరుమిట్లు గొలిపేలా..

వెలుగులు విరజిమ్మి.. ఉత్సవాలు మిన్నంటి..

విజయవాడ గాంధీనగర్ సీతన్న పేటలో దసరా ఉత్సవాలు మిన్నంటుతున్నాయి. ఇక్కడ రూ.30 లక్షలతో అమ్మవారి వేదికను తీర్చిదిద్దారు. వంద మీటర్ల పొడవునా రంగు రంగుల విద్యుత్తు దీపాలతో అలంకరించారు. అమ్మవారిని ప్రతిష్ఠించిన వేదిక.. పువ్వులు, కుండలు, బుట్టల్లో దీపాలను అందంగా వేలాడదీశారు. సినీ సెట్టింగ్‌లను తలపించేలా మండపాన్ని ఎంతో ఆకర్షణీయంగా రూపుదిద్దారు.

- ఈనాడు, అమరావతి,
- న్యూస్‌టుడే, విజయవాడ (గాంధీనగర్)


భక్తుల పూజలందుకుంటున్న అమ్మవారు

పంపింగ్ బూస్టర్ నిర్మాణం వివాదాస్పదం


పంపింగ్ బూస్టర్ పనులపై ఆక్షేపిస్తున్న నాయకులు

చిట్టినగర్, న్యూస్‌టుడే : తాగునీటి సమస్య పరిష్కారంలో భాగంగా చిట్టినగర్ విశ్వబ్రాహ్మణ కల్యాణ మండపం సమీపంలో కొత్తగా పంపింగ్ బూస్టర్ నిర్మాణంపై అఖిలపక్షం నాయకులు తీవ్రంగా వ్యతిరేకించారు. రద్దీగా ఉండే సొరంగం మార్గంలో ప్రధాన రోడ్డు పక్కన బూస్టర్ నిర్మాణం వల్ల తీవ్ర ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతాయని అభ్యంతరం వ్యక్తం చేశారు. నిర్మాణ పనులు నిలుపుదల చేయాలని, సంబంధిత అధికారులతో మాట్లాడతామని 48వ డివిజన్ కార్పొరేటర్ ఆదిలక్ష్మి భర్త పెదబాబు, వివిధ పార్టీల డి.వి.రమణబాబు, వెంకటేశ్వరరావు, జనార్దనరావు, సింగంశెట్టి రమణ, సూరిబాబు, పేరాబత్తు రమణ, మైలవరపు దుర్గారావు, బోయళ్ల కృష్ణ, ఉప్పాడి రాము, చెంచయ్య, నాగూర్, సుభానీ, హరిప్రసాద్, లోకేష్, నాగు, స్థానిక ప్రజలు అడ్డుకున్నారు.

నిర్మాణం నిలిపివేత: చిట్టినగర్‌లో పంపింగ్ బూస్టర్ నిర్మాణం అఖిలపక్షం నాయకులు అడ్డుకున్నారని తెలుసుకున్న భాజపా జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్, తెదేపా రాష్ట్రకార్యనిర్వాహక కార్యదర్శి ఎం.ఎస్.బేగ్, ఎమ్మెల్యే కార్యాలయం ఇన్‌ఛార్జి శ్రీధర్, రాధాకృష్ణ, గౌరీశంకర్, వీఎంసీ నీటి విభాగం డీఈ నారాయణమూర్తి, ఏఈ రాజేష్ ఆ ప్రాంతానికి చేరుకున్నారు. ఇబ్బంది ఉందని ఏకాభిప్రాయానికి రావడంతో బూస్టర్ నిర్మాణాన్ని నిలిపివేశారు. భూగర్భంలో ప్రధాన పైపులైను నుంచి పంపింగ్ బూస్టర్ ఏర్పాటు చేస్తామని డీఈ హామీ ఇచ్చారు. దీంతో సమస్యకు పరిష్కారం దొరికనట్లయింది.

శక్తి విజయోత్సవానికి పకడ్బందీగా ఏర్పాట్లు

భవానీపురం: కృష్ణానది ఒడ్డున పున్నమి ఘాట్ వద్ద నిర్వహించే శక్తి విజయోత్సవం కార్యక్రమానికి పకడ్బందీగా ఏర్పాట్లు చేసినట్లు సీపీ ఎస్.వి.రాజశేఖరబాబు తెలిపారు. పున్నమిఘాట్ వద్ద కార్యక్రమం జరిగే ప్రాంతాన్ని గురువారం రాత్రి ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా రాజశేఖరబాబు మాట్లాడుతూ శక్తి విజయోత్సవం కార్యక్రమానికి తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రుల సతీమణులు, రాష్ట్ర మంత్రులు, శాసనసభ్యులు హాజరవుతారని వెల్లడించారు. పర్యటనలో ఎస్పీ మలికా గార్గ్, డీసీపీలు గౌతమిషాలి, ఏడీసీపీలు, ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.


అధికారులకు సూచనలిస్తున్న సీపీ రాజశేఖరబాబు

ఘాట్‌ల వద్ద భవానీల కోలాహలం

భవానీపురం: రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి వచ్చిన భవానీలతో పున్నమి, భవానీ స్నానఘాట్‌లు కోలాహలంగా మారాయి. ఘాట్ వద్ద ఏర్పాటు చేసిన జల్లు స్నానాల వద్ద భవానీలు స్నానం చేసి నడుచుకుంటూ ఇంద్రకీలాద్రిపై అమ్మవారిని దర్శించుకునేందుకు వెళ్లారు. ఘాట్ వద్దనే తలనీలాలు సమర్పించారు. తాగునీటి సీసాలు అందించడంతో పాటు వైద్యశిబిరం, సమాచార కేంద్రం, క్లోక్‌రూం, చెప్పుల స్టాండు, తదితర వాటిని ఏర్పాటు చేశారు.


జల్లు స్నానం చేస్తున్న భవానీలు

విజయవాడ మధ్య

కళాపీఠం వార్షికోత్సవానికి ఆహ్వానం


ఆహ్వానపత్రం అందజేస్తున్న విజయలక్ష్మి, కామేశ్వరి, ప్రసూనారామన్ తదితరులు

గాంధీనగర్: నవంబరులో నిర్వహించే సావిత్రి కళాపీఠం వార్షికోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరు కావాలని మంత్రి కందుల దుర్గేష్‌ను కళాపీఠం అధ్యక్షురాలు పసుమర్తి విజయలక్ష్మి కోరారు. గురువారం ఆయనను కలిసి ఆహ్వానపత్రం అందజేశారు. వడ్డాది కామేశ్వరి, ప్రసూనరామన్, విష్ణుప్రియ, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

పాయకాపురం (మధురానగర్), న్యూస్‌టుడే : గన్నవరానికి చెందిన క్రౌన్ మినిస్ట్రీస్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో వాంబే కాలనీలో గురువారం మెగా వైద్యశిబిరం నిర్వహించారు. ట్రస్టు చైర్మన్ పాస్టర్ ఎ.రమేష్ పాల్ ప్రజలకు ఉచితంగా వైద్య పరీక్షలు చేశారు. గత నెలలో వరదల కారణంగా అనేక మంది వ్యాధులబారిన పడ్డారని, వారికి వైద్యం అందించాలన్న లక్ష్యంతో ఈ కార్యక్రమం చేపట్టినట్లు ఆయన తెలిపారు. ప్రజలకు జనరల్, నేత్ర వైద్య పరీక్షలు, రక్తపోటు, మధుమేహ పరీక్షలు చేశారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

అడుగెయ్యలేరు.. అడగలేరు..!

కంకర రోడ్డుతో తప్పని ఇక్కట్లు


మొనదేలిన రాళ్లలో నడవలేరు..

పాయకాపురం (మధురానగర్), న్యూస్‌టుడే

నగరంలోని శాంతినగర్, ప్రకాశ్‌నగర్ శివారులో దేవినేని రోడ్డు వాహనచోదకులు, పాదచారులను భయపెడుతోంది. 61వ డివిజన్, పాయకాపురంలోని ఈ ప్రాంతం.. అభివృద్ధికి ఆమడ దూరంలో ఉంది. మట్టిరోడ్లకు కంకర వేసి అభివృద్ధి చేశారు. బీటీ లేదా సీసీ రోడ్డు వేయకపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఇలా ఐదు వీధులు కంకర వేసి ఉన్నాయి. దాదాపు 200 కుటుంబాలు జీవిస్తున్నాయి. వీరంతా ఇబ్బందులు పడుతూనే రాకపోకలు సాగిస్తున్నారు.

ద్విచక్ర వాహనాలకు పంక్చర్లు..

కంకరరాళ్లని సూదిరాళ్లు.. గుచ్చుకుని వాహనాల టైర్లకు పంక్చర్లు పడుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక్కోసారి జారిపోతున్నాయి. పాదాచారులు నడిచేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి వేళలో పరిస్థితి దారుణంగా ఉంటోందని వాపోతున్నారు. గత ప్రభుత్వ హయాంలో ఈ ప్రాంతాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేశారు. కూటమి ప్రభుత్వం పాలకులైనా అభివృద్ధిపై దృష్టి పెట్టాలని స్థానికులు కోరుతున్నారు.


మరో దారి దుస్థితి..

అమ్మో.. విజయా టాకీస్ కూడలి..!

నగరంలోని విజయా టాకీస్ కూడలిలో భూగర్భ డ్రైనేజీ పొంగుతోంది. దారంతా మురుగుమయమైంది. వాహనాల రాకపోకల సమయంలో పాదచారులపై పడుతోంది. తీవ్ర దుర్గంధం వెదజల్లుతోంది. ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. డ్రైనేజీ నిర్వహణ తీరుపై మండిపడుతున్నారు. వీఎంసీ అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.
- న్యూస్‌టుడే, అరండల్‌పేట (సీతారాంపురం)


ఏలూరు రోడ్డులో..


పాత బస్టాండ్ వైపు వెళ్లే మార్గంలో..

అక్రమ నిర్మాణం తొలగింపు

స్పందనకు వందనం

మధురానగర్, న్యూస్‌టుడే : గుణదల ఒకటో డివిజన్ గాంధీజీకాలనీలో బుడమేరు గట్టుపై అక్రమంగా నిర్మిస్తున్న భారీ నిర్మాణాన్ని నగరపాలక సంస్థ పట్టణ ప్రణాళికా విభాగం అధికారులు గురువారం తొలగించారు.


పిల్లర్లు కూల్చివేశారిలా...

'కళ్లెదుటే నిర్మాణం.. కనపడదా అక్రమం..?' శీర్షికతో గురువారం 'ఈనాడు'లో ప్రచురితమైన కథనం అధికారులను ఉరుకులు పెట్టించింది. ఉదయాన్నే ఘటనాస్థలానికి చేరుకున్నారు. జేసీబీతో నిర్మాణం కోసం వేసిన బీమ్‌లను తొలగించారు. పిల్లర్లు కూల్చివేశారు. బుడమేరు గట్టు అక్రమార్కుల పరమవుతున్నా అధికారులు నిర్లిప్తంగా ఉండటం, పట్టపగలు బరితెగించి భారీ నిర్మాణం చేపడుతున్నా అధికారులు చూసీచూడనట్లు పోవడంపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్రమార్కులకు వత్తాసు పలికే వారిపై చర్యలు తీసుకుంటేనే.. అక్రమాలకు అడ్డుకట్ట పడుతుందని పేర్కొన్నారు. కాగా.. నిర్మాణాన్ని తొలగించకుండా అడ్డుకునేందుకు అధికార పార్టీకి చెందిన కొందరు నాయకులు రంగంలోకి దిగారు. అధికారులతో మాట్లాడి, కూల్చడం ఆపాలని ఒత్తిడి తెచ్చారు. అధికారులు ససేమిరా అంటూ కూల్చివేతను కొనసాగించారు. గురువారం రాత్రి వరకు తొలగిస్తూనే ఉన్నారు. శుక్రవారం మిగిలిన భాగాన్ని తొలగిస్తామని.. మళ్లీ నిర్మాణం చేపడితే కఠినచర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.


వెలుగులు విరజిమ్మి.. ఉత్సవాలు మిన్నంటి..


రహదారిపై విద్యుద్దీపాల కాంతులు


వేదిక లోపల మిరుమిట్లు గొలిపేలా..

విజయవాడ గాంధీనగర్ సీతన్న పేటలో దసరా ఉత్సవాలు మిన్నంటుతున్నాయి. ఇక్కడ రూ.30 లక్షలతో అమ్మవారి వేదికను తీర్చిదిద్దారు. వంద మీటర్ల పొడవునా రంగు రంగుల విద్యుత్తు దీపాలతో అలంకరించారు. అమ్మవారిని ప్రతిష్ఠించిన వేదిక.. పువ్వులు, కుండలు, బుట్టల్లో దీపాలను అందంగా వేలాడదీశారు. సినీ సెట్టింగ్‌లను తలపించేలా మండపాన్ని ఎంతో ఆకర్షణీయంగా రూపుదిద్దారు.
- ఈనాడు, అమరావతి,
- న్యూస్‌టుడే, విజయవాడ (గాంధీనగర్)


పూజలందుకుంటున్న అమ్మవారు


పైభాగాన్ని ఆకర్షణీయంగా తీర్చిదిద్దారిలా..

జ్యోత్స్న మరణం.. తీరని లోటు

సూర్యారావుపేట, న్యూస్‌టుడే : జ్యోత్స్న ఆకస్మిక మరణం మహిళా సాధికారత ఉద్యమానికి తీవ్రమైన నష్టమని జీఆర్‌కే పోలవరపు సాంస్కృతిక సమితి, ది ఫిలిం ఫెస్టివల్ సొసైటీ, మహాత్మాగాంధీ మందిర కమిటీ తమ సంతాప సందేశంలో పేర్కొన్నాయి. గురువారం ఆమె పార్థివదేహాన్ని గోళ్ల నారాయణరావు, గోళ్ల వాణి, డి.వి.రాజు, విజయ్‌కుమార్, లక్ష్మయ్య, రాంపిళ్ల జయప్రకాశ్ తదితరులు సందర్శించి నివాళులర్పించారు. మంచితనం, మానవత్వం, కార్యాచరణ తదితర అంశాల్లో జ్యోత్స్న మహోన్నతమైన వ్యక్తి అని కొనియాడారు. ఆమె ఉద్యమాన్ని ముందుకు తీసుకువెళ్లడమే.. నిజమైన నివాళి అని నారాయణరావు పేర్కొన్నారు.


నివాళులర్పిస్తున్న గోళ్ల నారాయణరావు తదితరులు

సీఎం దిల్లీ పర్యటన విజయవంతం

గాంధీనగర్, న్యూస్‌టుడే : రాష్ట్రానికి పెండింగ్ నిధులు, ప్రాజెక్టులు సాధించడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు దిల్లీ పర్యటన విజయవంతమైందని తెదేపా రాష్ట్ర కార్యదర్శి గన్నె వెంకట నారాయణ ప్రసాద్ అన్నారు. గురువారం ఆయన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. పోలవరం ప్రాజెక్టు, అమరావతికి నిధులు సాధించడంతో పాటు డిసెంబరులో విశాఖ కేంద్రంగా కొత్త రైల్వే జోన్ ఏర్పాటుకు ఆయన ఎంతో కృషి చేశారని చెప్పారు. మంత్రి లోకేశ్ చొరవతో విశాఖలో ఏర్పాటు కానున్న ఐటీ కంపెనీ ద్వారా 10వేల మంది యువతకు ఉపాధి లభిస్తుందని వివరించారు.

అథ్లెటిక్స్‌లో ప్రతిభ

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే : అజిత్ సింగ్‌నగర్‌లోని ఎంబీపీ స్టేడియంలో శిక్షకుడు బి.వెంకటేశ్వరరావు పర్యవేక్షణలో సాధన చేస్తున్న అథ్లెట్లు సత్తా చాటారు. ఇటీవల రాజమహేంద్రవరంలో రాష్ట్ర స్థాయి అంతర్ జిల్లాల జూనియర్ ఛాంపియన్‌షిప్ నిర్వహించారు. యు.రమ్య అండర్-20 విభాగంలో 400 మీ.ల హర్డిల్స్‌లో రజతం, డిస్కస్ త్రోలో కాంస్య పతకం సాధించింది. ఎం.శృతి అండర్-20 బాలికల విభాగంలో 400 మీ.ల పరుగులో కాంస్య పతకం గెలుపొందింది.


క్రీడాకారులతో వెంకటేశ్వరరావు

'అప్పుడు స్పందన లేదు.. ఇప్పుడు ధర్నాలా?'

ఈనాడు, అమరావతి : విజయవాడను వరదలు ముంచెత్తినప్పుడు ప్రజల్ని ఆదుకోవడానికి ముందుకురాని జగన్ పేటీఎం బ్యాచ్‌లు నేడు ధర్నాలు చేస్తున్నాయని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ మండిపడ్డారు. వరద సాయం మీదా వాళ్లు బురద జల్లుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వీరి మాటల్ని ప్రజలు అసహ్యించుకొంటున్నారని మండిపడ్డారు. నిద్రాహారాలు మాని 12 రోజులు విజయవాడ కలెక్టరేట్‌లో ఉండి ముఖ్యమంత్రి చంద్రబాబు బాధితుల్ని ఆదుకొన్నారని గుర్తుచేశారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. "ఫైర్ ఇంజిన్లతో ఇళ్లు శుభ్రం చేయించి... చంద్రబాబు కొత్తఒరవడి సృష్టించారు. నష్టపోయిన ప్రతిఒక్కరికీ పరిహారం అందించాం" అని శివనాథ్ పేర్కొన్నారు.

యువకుడిపై బ్లేడ్‌తో దాడి

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే : డబ్బులు ఇవ్వకపోవడంతో ప్రవీణ్ అనే యువకుడిపై గుర్తు తెలియని వ్యక్తి బ్లేడ్‌తో దాడి చేసి గాయపరిచిన ఘటన పాత బస్టాండ్ సమీపంలో గురువారం సాయంత్రం చోటుచేసుకుంది. కావలికి చెందిన సంగా ప్రవీణ్ ప్రైవేట్ ట్రావెల్స్‌లో పని చేస్తుంటారు. గురువారం సాయంత్రం పాత బస్టాండ్ వద్ద ఉండగా గుర్తు తెలియని వ్యక్తి వచ్చి డబ్బులు అడిగాడు. డబ్బులు లేవనటంతో బ్లేడ్‌తో దాడి చేశాడు. బాధితుడిని ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

'హరియాణాలో మళ్లీ ఎన్నికలు నిర్వహించాలి'

విజయవాడ (గవర్నర్‌పేట), న్యూస్‌టుడే : హరియాణా ఎన్నికల్లో కాంగ్రెస్ విజయమని అన్ని ఎగ్జిట్ పోల్స్ చెప్పాయని, ప్రజాభిప్రాయానికి విరుద్ధంగా ఫలితం వచ్చిందని ఏపీసీసీ మాజీ అధ్యక్షుడు సాకే శైలజానాథ్ పేర్కొన్నారు. గురువారం ఆయన విజయవాడలో విలేకరులతో మాట్లాడారు. ఈవీఎంలపై కాంగ్రెస్ పార్టీకి అనేక అనుమానాలున్నాయని, బ్యాలెట్ ద్వారా మళ్లీ ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. జమిలి ఎన్నికలకు ముఖ్యమంత్రి చంద్రబాబు అనుకూలంగా ఉన్నారని విలేకరులు ప్రశ్నించగా.. గతం చంద్రబాబులా ఆయన్ని చూడొద్దని, ఇప్పుడు ఎన్డీయేలో పూర్తి స్థాయి సభ్యత్వం పొందారని పేర్కొన్నారు. కాంగ్రెస్‌పై మోదీ చేసిన వ్యాఖ్యలను ఖండించారు. కులాలను బట్టి జైళ్లలో పనులు కేటాయించడం వివక్షేనని న్యాయస్థానం చెప్పిందని గుర్తుచేశారు. జనగణన చేపట్టాలని డిమాండ్ చేశారు. ఉప ముఖ్యమంత్రి సనాతన ధర్మం అని పదే పదే మాట్లాడుతున్నారని, అదేంటో చెప్పాలని డిమాండ్ చేశారు. దళితులు ఊరి బయటే ఉండాలన్న సనాతన ధర్మాన్ని సమర్థిస్తారా? అని ప్రశ్నించారు. అనేక దేవాలయాల్లోకి ఇప్పటికీ కొంత మందికి ప్రవేశం లేదని, దీన్ని సమర్థిస్తారా? అని నిలదీశారు. రాయలసీమలో వర్షాలు లేక పంటలు పాడైపోయాయని, వరదలు వస్తే ప్రజలకు ఏం సాయం అందిందని ప్రశ్నించారు. కర్నూలుకు ఇస్తామన్న హైకోర్టు ఏమైందన్నారు. విశాఖ ఉక్కును ఏపీ ప్రభుత్వమే నడిపిస్తుందని చంద్రబాబు ఎందుకు ప్రకటించరు అని అడిగారు. సామాన్య ప్రజలు, దళితులకు వైద్య విద్య దూరం చేస్తున్నారని పేర్కొన్నారు. కాగా.. పారిశ్రామిక దిగ్గజం రతన్‌టాటా మరణంపై నాయకులంతా సంతాపం తెలియజేశారు. కార్యక్రమంలో కొలను కొండ శివాజీ, కిరణ్, నరహరిశెట్టి నరసింహారావు, మేడా సురేష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సాకే శైలజానాథ్. చిత్రంలో కిరణ్, నరసింహారావు, సురేష్

రోగుల వైద్యంపై ఆరా

గాంధీనగర్ : సకాలంలో చికిత్స తీసుకోవడం ద్వారా మానసిక సమస్యల నుంచి బయటపడవచ్చని 4వ అదనపు సీనియర్ సివిల్ జడ్జి పి.రాజారామ్ అన్నారు. ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో గురువారం పాత ప్రభుత్వాస్పత్రిని సందర్శించారు. రోగులకు అందుతున్న వైద్యం గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. మానసిక ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని న్యాయమూర్తి సూచించారు. వార్డుల్లో రోగులకు పండ్లు, రొట్టెలు పంచారు. ఈ కార్యక్రమంలో ప్యానల్ న్యాయవాది పి.రాము, డాక్టర్ రాఘవరావు, సితార, అజయ్, రామనరేష్, డి.గౌతమ్, ఎ.పుష్పలత తదితరులు పాల్గొన్నారు.


వివరాలు తెలుసుకుంటున్న న్యాయమూర్తి రాజారామ్

భావోద్వేగాల నియంత్రణ అవసరం

గాంధీనగర్, న్యూస్‌టుడే : భావోద్వేగాల నియంత్రణ లేకపోవడం వల్లే నేరాలు జరుగుతున్నాయని హైకోర్టు న్యాయవాది, సైకాలజిస్టు డాక్టర్ అంబవరం ప్రతాప్‌రెడ్డి అన్నారు. సెంటర్ ఆఫ్ సైకాలజికల్ రీసెర్చ్ అండ్ వెల్‌బియింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం గాంధీనగర్‌లోని జిల్లా కారాగారంలో ఖైదీలు, సిబ్బందికి మానసిక ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ.. పని ప్రదేశంలో మానసిక సమస్యల నుంచి ఎలా బయటపడాలి, ఖైదీలతో ఎలా వ్యవహరించాలో వివరించారు. సైకాలజిస్టు రమాదేవి మాట్లాడుతూ.. శారీరక ఆరోగ్యం తరహాలోనే మానసిక ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. యోగా, ధ్యానం వంటి వాటితో ఒత్తిడిని జయించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో జైలర్ గణేష్, వేణు, గోపయ్య నాయక్, సైకాలజిస్టులు శ్రావణకృష్ణకుమారి, తేజావతి, ద్రాక్షాయణి, భావన, లక్ష్మణ్‌కుమార్, శిరీష, అనుపమ, షర్మిల, ఎం.వి.బ్రహ్మానందరెడ్డి, రియాజ్, న్యాయవాది కృప పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సైకాలజిస్ట్ ప్రతాప్‌రెడ్డి

కనకదుర్గమ్మా.. మమ్మేలగ రావమ్మా..


గవర్నర్‌పేట కాశీ విశ్వేశ్వర అన్నపూర్ణ దేవస్థానంలో..


మధురానగర్‌లో..


అజిత్‌సింగ్‌నగర్‌లో..


బావాజీపేటలో..


సత్యనారాయణపురం కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో..


అయోధ్యనగర్ శివకామేశ్వరి ఆలయంలో..

దేవీనవరాత్రోత్సవాలను పురస్కరించుకొని గురువారం అమ్మవారు భక్తులకు దుర్గాదేవిగా దర్శనమిచ్చారు. ఆలయ కమిటీల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉత్సవాల్లో మహిళలు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. నగరంలోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. - **న్యూస్‌టుడే, బృందం**


సీతారాంపురంలో..


మధురానగర్‌లో లక్కీడ్రాలో గెలుపొందిన మహిళలకు చీరల బహూకరణ


కార్మికపురంలో..


దుర్గాపురంలో..


కస్తూరిబాయిపేటలో


నీలకంఠేశ్వరపీఠంలో..


కన్యకాపరమేశ్వరి ఆలయంలో కుంకుమపూజలు

ఉద్యమనేత.. నాగటి

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే : ఉద్యమ నేతగా నాగటి నారాయణ.. ఉపాధ్యాయులు, ఉద్యోగులకు పలు ప్రయోజనాలు చేకూర్చడంలో విశేష కృషి చేశారని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుందరయ్య పేర్కొన్నారు. గురువారం గవర్నర్‌పేటలోని యూటీఎఫ్ కార్యాలయంలో నారాయణ ద్వితీయ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఆయన చిత్రపటం వద్ద సంఘ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సుందయ్య మాట్లాడుతూ.. అప్రెంటిస్ రద్దు, అప్రెంటిస్ సర్వీస్‌కు నోషనల్ ఇంక్రిమెంట్లు ఇప్పించడానికి 13 రోజుల పాటు సమ్మె చేశారన్నారు. తొమ్మిదో పీఆర్‌సీలో మెరుగైన ఫిట్‌మెంట్ కోసం నాటి ప్రభుత్వంతో పోరాడారని చెప్పారు. నారాయణ జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని.. ఉపాధ్యాయుల సంక్షేమం కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కోశాధికారి పి.నాగేశ్వరరావు, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ ఎ.గోపాలకృష్ణ, రత్నకమల్ బాబు, డి.ప్రభాకర్, శ్రీరామచంద్రమూర్తి, శిరీష్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

మానసిక ఆరోగ్యానికి ప్రాధాన్యం

విజయవాడ(గాంధీనగర్), న్యూస్‌టుడే : మానసిక ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇవ్వాలని సైకాలజిస్ట్ డాక్టర్ కాజ మానస అన్నారు. ప్రపంచ మానసిక ఆరోగ్య వారోత్సవాల సందర్భంగా గురువారం ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. పని ప్రదేశంలో మానసిక ఒత్తిడి వల్ల సమస్యలు ఏర్పడుతున్నాయని చెప్పారు. ఉద్యోగులకు అనుకూలమైన వాతావరణం, కౌన్సెలింగ్, మానసిక ఆరోగ్య ప్రాముఖ్యతను వివరించడమే.. నివారణ మార్గాలని చెప్పారు. సకాలంలో మందులు వాడడం ద్వారా సమస్యల నుంచి బయటపడవచ్చన్నారు. వారోత్సవాల్లో భాగంగా అవగాహన కార్యక్రమాలు, ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించినట్లు చెప్పారు. డాక్టర్ అయోధ్య తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు సాయం

అజిత్‌సింగ్‌నగర్ (మధురానగర్), న్యూస్‌టుడే : ఎన్టీఆర్ జిల్లా కళింగ కోమటి సేవా సంఘం ఆధ్వర్యంలో బుడమేరు వరద బాధితులకు వస్త్రాలు, నిత్యావసర వస్తువుల కిట్లను గురువారం అందించారు. నందమూరినగర్ భరతమాత మందిరంలో సంఘం అధ్యక్షుడు వడ్డి శ్రీనివాసరావు చేతుల మీదుగా 80 మందికి ఒక్కొక్కరికి రూ.2,200ల విలువైన వస్తువులను అందించారు. ఆయన మాట్లాడుతూ.. బాధితులకు సాయం చేయాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు చెప్పారు. పెద్దిన తిరుమలరావు, ఉన్న నాగభూషణరావు, గోపాలశెట్టి సత్యనారాయణ, కొత్తకోట నరసింహమూర్తి, దామోదర గణపతిరావు పాల్గొన్నారు.


సరకులు అందిస్తున్న శ్రీనివాసరావు, తిరుమలరావు, నాగభూషణరావు

నష్టపరిహారం చెల్లించాల్సిందే..

విజయవాడ(గాంధీనగర్), న్యూస్‌టుడే : వరద బాధితులందరికీ నష్టపరిహారం చెల్లించాలని ఎన్టీఆర్ జిల్లా వైకాపా అధ్యక్షుడు దేవినేని అవినాష్ డిమాండ్ చేశారు. గురువారం ధర్నా చౌక్‌లో నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. వరద బాధితులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. కలెక్టరేట్ వద్ద బాధితులు పడిగాపులు కాస్తున్నా.. పట్టించుకోవడం లేదని విమర్శించారు. వైకాపా కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పూనూరు గౌతమ్‌రెడ్డి మాట్లాడుతూ.. ఖర్చులపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఇప్పటి వరకు ఎంత ఖర్చు చేశారో మంత్రులు చెప్పలేకపోతున్నారన్నారు. మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు మాట్లాడుతూ.. గతంలో వాలంటీర్ల ద్వారా సేవలు అందించేవారమని, ప్రస్తుతం పరిహారం కోసం బాధితులు ఆందోళనలు చేస్తున్నారని చెప్పారు. తక్షణమే రీఎన్యూమరేషన్ చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ రూహుల్లా, మేయర్ భాగ్యలక్ష్మి, డిప్యూటీ మేయర్లు బెల్లం దుర్గ, అవుతు శైలజారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మొండితోక జగన్‌మోహనరావు, తన్నీరు నాగేశ్వరరావు, తిరుపతి యాదవ్, కడియాల బుచ్చిబాబు, పెద్ద సంఖ్యలో వైకాపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


ధర్నాలో రూహుల్లా, విష్ణు, అవినాష్, వెలంపల్లి, గౌతమ్‌రెడ్డి తదితరులు



పుస్తకాల పంపిణీ

అజిత్‌సింగ్‌నగర్ (మధురానగర్), న్యూస్‌టుడే : బుడమేరు వరదల కారణంగా న్యూ రాజరాజేశ్వరీపేట, అజిత్‌సింగ్‌నగర్, పాయకాపురం తదితర ప్రాంతాల్లో పుస్తకాలు పాడైపోయిన విద్యార్థులకు హరివిల్లు ఫౌండేషన్ పుస్తకాలను పంపిణీ చేసింది. గురువారం ఇంటింటికీ వెళ్లి 250 మంది విద్యార్థులకు రాత పుస్తకాలను అందించారు. ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ శరత్‌కుమార్, యు.కనకారావు, ఎం.శ్రీదేవి, నజీర్, పి.రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

స్వర్గపురిలో దహన సంస్కారాల నిలిపివేత

కృష్ణలంక, న్యూస్‌టుడే: విజయవాడ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నడుస్తున్న కృష్ణలంక స్వర్గపురిలో మరమ్మతుల నిమిత్తం ఈనెల 12, 13, 14వ తేదీల్లో దహన సంస్కారాలు తాత్కాలికంగా నిలిపి వేస్తున్నట్లు కమిషనర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.


కృష్ణమ్మకు హారతి




నగరోత్సవంలో..




మదినిండా అమ్మ తలంపే..

శక్తి స్వరూపం.. భక్త నీరాజనం..

రేపటితో దసరా ఉత్సవాల ముగింపు

ఈనాడు, డిజిటల్ - అమరావతి, న్యూస్‌టుడే - ఇంద్రకీలాద్రి, చిట్టినగర్, భవానీపురం, కృష్ణలంక





విజయవాడ ఇంద్రకీలాద్రిపై దసరా ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. గురువారం అమ్మవారు శ్రీ దుర్గా దేవి అలంకారంలో భక్తులను అనుగ్రహించారు. వేలాదిగా భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ ఉత్సవాలు రేపటితో ముగియనున్నాయి. శుక్రవారం మహిషాసురమర్దిని దేవిగా, శనివారం పండగ రోజు శ్రీరాజరాజేశ్వరిదేవి రూపంలో దుర్గమ్మ భక్తులకు దర్శనమిస్తుంది. దసరా రోజు సాయంత్రం ప్రకాశం బ్యారేజీకి ఎగువన దుర్గఘాట్‌లో తెప్పోత్సవం నిర్వహించనున్నారు. ఇందుకు హంస వాహనాన్ని ఇప్పటికే సిద్ధం చేశారు. ఆలయ అధికారులు, వేదపండింతులు కలిసి మంగళ వాయిద్యాలు, కోలాటం మధ్య దుర్గామల్లేశ్వరస్వామి వార్ల ఉత్సవమూర్తులను ఊరేగింపుగా దుర్గాఘాట్ వద్దకు తీసుకొచ్చి.. హంస వాహనంపై ఉంచి పూజలు నిర్వహించాక నదీ విహారానికి తీసుకెళ్తారు.

భవానీ భక్తుల రాక ఆరంభం...

దుర్గగుడికి భవానీ భక్తుల రాక ఆరంభమైంది. దసరా ఉత్సవాల చివరి మూడు రోజుల్లో కొందరు భవానీ భక్తులు అమ్మవారి ఆలయానికి చేరుకుంటారు. దసరా మరుసటి రోజు నుంచి రెండు రోజులు... వేల మంది భవానీలు దుర్గమ్మ దర్శనానికి వస్తారు. భవానీ భక్తుల కోసం దుర్గమ్మను శ్రీరాజరాజేశ్వరీదేవి అలంకారంలోనే రెండు రోజులు ఉంచుతారు. అమ్మవారిని దర్శించుకున్న తర్వాత కొండ దిగువన కనకదుర్గానగర్‌లో భవానీలు మాల విరమణ చేస్తారు. గత ఏడాది విరమణకు సరైన ఏర్పాట్లు చేయకపోవడంతో.. భవానీలు తీవ్ర అసంతృప్తితో వెళ్లారు. వాళ్ల ఇరుముడిగా తీసుకొచ్చిన బియ్యం, కొబ్బరికాయలను సైతం కనకదుర్గానగర్‌లో రహదారుల పక్కన పడేశారు. ఈసారి అలా జరగకుండా ఏర్పాట్లు చేయాలని భవానీలు విజ్ఞప్తి చేస్తున్నారు.


తల్లీ శరణు


జయహో దుర్గా భవానీ




కళా వేదికపై ఆకట్టుకున్న ప్రదర్శన


నృత్య విన్యాసం

నేటి అలంకారం

శ్రీ మహిషాసురమర్దినీ దేవి



మహిష మస్తక నృత్తవినోదిని
స్ఫుటరణన్మణినూపుర మేఖలా
జనన రక్షణ మోక్షవిధాయిని
జయతి శుంభ నిశుంభ నిషూదిని॥

లోకకంటకుడైన మహిషాసురుడిని చంపిన మహోగ్ర రూపం ఇది. సకలదేవీ, దేవతల శక్తులన్నీ ఈ దేవీలో మూర్తీభవించి ఉంటాయి. మానవనేత్రంతో చూడ సాధ్యం కాని దివ్యతేజస్సుతో, అనేక ఆయుధాలతో సింహవాహినియై ఈ తల్లి భక్తులకు దర్శన భాగ్యం కలిగిస్తుంది. ఈ తల్లి అనుగ్రహం పొందితే అసాధ్యమనేది ఉండదు. మహిషాసుర సంహారం జరిగిన రోజునే 'మహర్నవమి'గా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ఈ రోజున చండీ సప్తశతీహోమం చేసిన వారికి శత్రుభయం ఉండదు. అన్నింటా విజయం కలుగుతుంది. ఓం ఐం హ్రీం శ్రీం సర్వసమ్మోహిన్యై స్వాహా అనే మంత్రాన్ని జపించి, పానకం, వడపప్పు, గారెలు, పులిహోర, పాయసాన్నం నివేదన చేయాలి. సువాసినీ పూజ చేసి, మంగళద్రవ్యాలు, శక్తికొద్దీ నూతన వస్త్రాలు పెట్టాలి.


కుంకుమార్చనలో..


కన్నయ్య లీలా వినోదం


క్యూలైన్లలో భక్తులు


కళాభినయం

కృష్ణమ్మ మదిలో.. సేవారతన్


- ఆదర్శ పల్లెలకు 'టాటా' బాటలు
- 264 గ్రామాలకు ట్రస్టు సేవలు
- ఎన్టీఆర్ జిల్లాలో రూ.కోట్లు వెచ్చింపు
- 2019 తర్వాత అందని ప్రభుత్వ చొరవ

ఈనాడు, అమరావతి

అది 2015.. విజయవాడ పార్లమెంటు పరిధిలో గంపలగూడెం మండలం నెమలిలో ఊరంతా జ్వరాల బారిన పడింది. రాష్ట్రంలో నాడు డెంగీ జ్వరాలు ఎక్కువగా వ్యాపించాయి. గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించారు. కానీ వారికి ఉచిత, మెరుగైన చికిత్స కావాలంటే ఎలా? నాడు పారిశ్రామిక దిగ్గజం.. టాటా సంస్థ సేవా కార్యక్రమాల్లో భాగంగా రూపొందించిందే.. కుటుంబ ఆరోగ్య కార్డు. విజయవాడ ఎంపీ పరిధిలో 264 గ్రామాల్లో 2.50 లక్షల కుటుంబాలకు ఈ కార్డులు అందించారు. ఒక్క కార్డు ఆధ్వర్యంలో కుటుంబంలో సభ్యులు అందరికీ ఏడాదిలో రూ. లక్ష విలువైన వైద్యం కార్పొరేట్ ఆసుపత్రుల్లో అందించారు. 2015 నుంచి నాలుగేళ్లు ఈ సేవలు కొనసాగాయి. కొన్ని వేల కుటుంబాలు లబ్ధి పొందాయి.

తిరువూరు పరిధిలో కోడూరు గ్రామ యువతి స్పందన.. కుట్టుమిషన్‌తో దుస్తులు కుట్టేది. టాటాట్రస్టు సేవల్లో భాగంగా ఇంటర్నెట్ సాథీ కార్యక్రమంలో భాగస్వామి అయ్యారు. టాటా ట్రస్టు వాలంటీర్లు ఆమెకు ఇంటర్నెట్ వినియోగంపై శిక్షణ ఇచ్చారు. నైపుణ్యాలు పెంచేలా అవగాహన కల్పించారు. తర్వాత ఆమె ఇంటర్నెట్ ఆధారంగా సరికొత్త డిజైన్లు రూపొందించి కుట్టేవారు. తద్వారా ఆదాయం పెరిగింది. ఇలా ఆమె ఒక్కరే కాదు.. వేల మందికి ఇంటర్నెట్ సాథీ ఉపకరించింది.

ఇవేకాదు.. విద్య, వైద్యం, ఉపాధి, గ్రామీణాభివృద్ధి లక్ష్యంగా టాటా ట్రస్టు సేవలు మరువలేనివి. విజయవాడ పార్లమెంటులో 264 గ్రామాలను స్మార్టు విలేజ్‌లుగా రూపొందించేలా ట్రస్టు సేవలు ప్రారంభించి నాలుగేళ్లు కొనసాగించింది. ఇందుకు వివిధ సేవా కార్యక్రమాలకు సుమారు రూ.3 వేల కోట్లు వెచ్చించినట్లు సమాచారం. ప్రధాని మోదీ సంసాద్ ఆదర్శ గ్రామ యోజన ఆలోచనలో భాగంగా గ్రామీణాభివృద్ధికి టాటా ట్రస్టు విజయవాడ పార్లమెంటును ఎంపిక చేసుకుని నాటి ఎంపీ కేశినేని నాని చొరవతో ఎన్నో కార్యక్రమాలు చేపట్టింది. 2019 తర్వాత ఎంపీగా నాని ఎన్నికైనా.. ప్రభుత్వం మారడంతో సేవా కార్యక్రమాలు దాదాపు నిలిచిపోయాయి.




2011లో విజయవాడలో టాటా వినియోగదారులు, డీలర్లతో కరచాలనం


విజయవాడలో ఆర్చరీ క్రీడాకారిణి జ్యోతిసురేఖకు అభినందన. పక్కన నాటి సీఎం చంద్రబాబు, పూర్వ ఎంపీ కేశినేని నాని

టాటా ట్రస్టు.. ముందడుగు..!

టాటా ట్రస్టుకు కేశినేని నానికి విడదీయరాని అనుబంధం ఉంది. ట్రస్టు ఛైర్మన్‌గా ఉన్న పారిశ్రామిక దిగ్గజం.. దేశంలో ఎంపీలు అందరికీ ఒక గ్రామాన్ని దత్తత తీసుకోవాలని 2014లో లేఖలు రాశారు. దానికి అవసరమైన నిధులు ట్రస్టు సమకూరుస్తుందని హామీ ఇచ్చారు. అలా విజయవాడ ఎంపీ స్పందించి ఒక గ్రామం పేరు సూచించి ప్రణాళికలు పంపారు. నాడు ప్రధాని సంసాద్ ఆదర్శ గ్రామ యోజన ప్రారంభమైంది. దీనికి అనుబంధంగా విజయవాడ పార్లమెంటు పరిధిలో అయిదు గ్రామాలను టాటా ట్రస్టు ఎంపిక చేయాలని భావించి క్రమేపీ 264 గ్రామాలను దత్తత తీసుకుని ఆదర్శ గ్రామాలుగా రూపొందించేలా ప్రణాళికలు రూపొందించారు. దీనిపై 2015 ఆగస్టు 24న విజయవాడలో భారీగా చేపట్టిన దత్తత స్వీకార కార్యక్రమానికి ఛైర్మన్ రతన్‌టాటా హాజరయ్యారు.



టాటా ట్రస్ట్ అందజేసిన రిక్షా ద్వారా చెత్త సేకరణ

సీఎం చంద్రబాబు హాజరై ఒప్పందం చేసుకున్నారు. అదే రోజు గేట్‌వే హోటల్ లోనూ పారిశ్రామిక సదస్సులో రతన్ టాటా పాల్గొన్నారు.

ట్రాఫిక్‌లో చిక్కుకున్న టాటా...

బెజవాడతో టాటా అనుబంధం ఎక్కువే. మధ్య తరగతి కుటుంబానికి రూ.లక్ష కారు... నానోను అవిష్కరించాక ఆయన 2011 ఆగస్టు 20న విజయవాడ వచ్చారు. టాటా షోరూంలో.. 100 నానో కార్లు అందించే కార్యక్రమానికి హాజరైన ఆయన గన్నవరంలో విమానం దిగి రామవరప్పాడు షోరూమ్‌కు వస్తుండగా లారీ డ్రైవర్ల సమ్మెతో ఇరుక్కుపోయారు. కారు దిగిన ఆయనను లారీ ఓనర్స్ గమనించి ఆయన కారును మాత్రం తప్పించి సమావేశానికి పంపారు. తర్వాత 2015లో గ్రామాల దత్తతకు హాజరయ్యారు. అప్పుడే పారిశ్రామిక సదస్సులో పాల్గొన్నారు. నాటి ఎంపీ నాని కూతురు వివాహానికి (హైదరాబాద్‌లో) హాజరై ఆశీర్వదించారు. రతన్‌తో నానికి అనుబంధం ఉంది. విజయవాడలో ఏర్పాటు చేయాల్సిన క్యాన్సర్ ఆసుపత్రిని నాటి సీఎం చంద్రబాబు సూచన మేరకు తిరుపతికి మార్చారు.



2011లో నానో కారు కొనుగోలుదారుకు తాళం చెవి అందిస్తూ..


టాటాట్రస్టు తోడ్పాటుతో నిర్మించిన మరుగుదొడ్డి

ప్రణాళికలతో ప్రారంభం..!

మొదట అర్బన్ నియోజకవర్గాలు మినహా నాలుగు సెగ్మెంట్లలో 264 గ్రామాల్లో అభివృద్ధి ప్రణాళికలు రూపొందించారు. టాటా ట్రస్టు ఆధ్వర్యంలో 1,200 మంది వాలంటీర్లను నియమించారు. మూడు నెలలు అన్ని గ్రామాల్లో ఇంటింటికి తిరిగి వారికి ఏం కావాలో 150 ప్రశ్నలతో ఒక ప్రణాళిక రూపొందించారు. వీటిని క్రోడీకరించి గ్రామాల్లో అభివృద్ధికి ముందు విద్య, వైద్యం, ఉపాధి అంశాలను ఎంపిక చేశారు. ఆ కార్యక్రమాలు నిర్వహించారు. దీనికి ఒక వ్యవస్థను పెట్టి... విజయవాడలో ట్రస్టు కార్యాలయం ఏర్పాటు చేశారు. రాష్ట్ర కోఆర్డినేటర్‌గా రాజేందర్‌ను నియమించారు. ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంతో విస్తృత సేవా కార్యక్రమాలు నిర్వహించారు.

వైద్యం... ప్రాధాన్యం..!

ప్రధాని పిలుపు మేరకు నాటి ఎంపీ నాని గొల్లమందలను ఎంపిక చేసుకుని ఆదర్శ గ్రామంగా పలు అభివృద్ధి పనులు నిర్వహించారు. అదే తరహాలో 264 గ్రామాల ప్రణాళిక తయారైంది. ఈ గ్రామాల్లో టాటా ట్రస్టు ద్వారా ఎక్కువగా వైద్య సేవలు అందించారు. ఆరోగ్య కార్డు 2.50 లక్షల కుటుంబాలకు అందించారు. కొన్ని వందల వైద్య శిబిరాలు నిర్వహించారు. 16 మండలాల్లో 22 టెలీ మెడిసిన్ సెంటర్‌లు ఏర్పాటు చేసి స్పెషలిస్టులతో చికిత్స అందించేవారు. 120 మంది వైద్యులను నియమించి రెండు బస్సులు పెట్టి శిబిరాలు నిర్వహించేవారు. తద్వారా 1.40 లక్షల మందికి వివిధ రకాల చికిత్సలు, మందులు అందించారు. టెలీమెడిసిన్ కేంద్రాల ద్వారా దాదాపు లక్ష మందికిపైగా చికిత్స పొందారు. ఒక్క టెలీ మెడిసిన్ కేంద్రానికి రూ.60 లక్షల వరకు ఖర్చు చేశారు. బీమా కార్డుల ద్వారా 16 వేల మందికి ఉచిత ప్రసవాలు కార్పొరేట్ ఆసుపత్రుల్లో చేశారు. ఎ.కొండూరు మండలంలో వైద్యశిబిరాల ద్వారా అక్కడ కిడ్నీ వ్యాధుల తీవ్రత వెలుగు చూసింది. ఇబ్రహీంపట్నంలో రూ.50 లక్షలతో సెంట్రల్ ల్యాబ్ ఏర్పాటుకు ప్రతిపాదించారు.


జి. కొండూరులో టాటా టెలీ మెడిసిన్ సెంటర్


పెనుగంచిప్రోలు మండలంలో టాటా ట్రస్టు నిర్మించిన తాగునీటి ట్యాంకును ప్రారంభిస్తున్న నెట్టెం రఘురాం, శ్రీరాం తాతయ్య

మగువలకు బలం.. పల్లెకు జలం..

ఇంటర్నెట్‌సాథీ పేరుతో వేల మందికి అంతర్జాల వినియోగం, నైపుణ్యాల మెరుగుకు తర్ఫీదు ఇచ్చారు. స్వయం ఉపాధిని పెంచారు. వీరిలో మహిళలే ఎక్కువ. అంగన్‌వాడీ కేంద్రాలను ఆధునికీకరించి.. పిల్లలకు పౌష్టికాహారం అందించారు. గత ప్రభుత్వ నాడు నేడు తరహా పనులు బడుల్లో టాటా ట్రస్టు చేపట్టింది. కొన్ని మండలాల్లో పార్కులు అభివృద్ధి చేశారు. దాదాపు 400 వరకు మంచినీటి ట్యాంకులు నిర్మించారు. చెత్త రిక్షాలు, బుట్టలు పంపిణీ చేశారు. కొందరు రైతులకు సూక్ష్మ సేద్య పరికరాలు అందించారు. నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇచ్చారు. 2019 తర్వాత సేవలు నిలిచిపోయాయి.

నా బిడ్డను బతికించింది



2016లో తొమ్మిదేళ్ల వయసున్న నా కుమారుడు వెంకట సూర్య ధనుష్ అకస్మాత్తుగా అనారోగ్యానికి గురయ్యాడు. రక్త సంబంధిత వ్యాధికి గురవడంతో విజయవాడ కార్పొరేట్ ఆస్పత్రిలో వైద్యం చేయించాల్సి వచ్చింది. వైద్యానికి రూ.లక్ష వరకు అవుతుందని చెప్పారు. నా కుటుంబానికి స్థోమత లేదు. నాటి ఎంపీ నానిని ఆశ్రయించగా టాటా ట్రస్ట్ ద్వారా కార్పొరేట్ ఆస్పత్రిలో నా బిడ్డకు రూ. లక్ష విలువైన వైద్యం చేయించారు. నా బిడ్డ ఆరోగ్యంగా ఉండటానికి కారణమైన రతన్ టాటా రుణం తీర్చుకోలేనిది. **- మలిశెట్టి రాంబాబు, మేడూరు, గంపలగూడెం**

జ్వరం నుంచి కోలుకున్నాను



తీవ్ర జ్వరంతో బాధపడుతూ ప్రైవేటు ఆస్పత్రిలో చేరాను. రూ.60 వేల వరకు ఖర్చవగా, ఆ మొత్తం టాటా ట్రస్ట్ కార్డు ద్వారానే ఆస్పత్రికి చెల్లించారు. నాలాంటి లక్షల మందికి టాటా ట్రస్ట్ ప్రాణదానం చేసింది.

- మల్లవల్లి పవన్, పొందుగల, మైలవరం మండలం

మా పాప ప్రాణం నిలబడింది

మా పాప రహానా 2019లో డెంగీ బారిన పడింది. తీవ్రంగా ఇబ్బందులు పడుతున్న తరుణంలో టాటా ట్రస్ట్ హెల్త్ కార్డుతో గొల్లపూడిలోని ఆంధ్రా హాస్పిటల్‌లో చేర్పించగా, ఖరీదైన వైద్యం అందింది. సుమారు రూ.70 వేలకు పైగా ఖర్చవగా.. వారే చెల్లించారు.

- షేక్ జబ్బార్, మైలవరం

కాన్పులకు ఆర్థిక చేయూత



2016, 2017లో నా భార్య రాజకుమారికి ఓ ప్రయివేటు ఆస్పత్రిలో సిజేరియన్ ద్వారా ఇద్దరు ఆడపిల్లలు పుట్టారు. ఇందుకు రూ.80 వేలు ఖర్చయింది. నాటి ఎంపీ నానిని కలిసి సిజేరియన్ కాన్పునకు సాయం చేయాలని వినతి ఇచ్చాను. ఆయన వెంటనే టాటా ట్రస్ట్ ద్వారా ఆ మొత్తం ప్రయివేటు ఆస్పత్రి వైద్యులకు చెల్లించే ఏర్పాటు చేశారు. రతన్ టాటా మా కుటుంబానికి అందించిన సాయం మరిచిపోలేను. **- గద్దల రవిచంద్ర, గంపలగూడెం**